# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 13-12-2024 ₹ 15/-


## అబ్రకదబ్ర వ్యవస్థ









గీటురాయి వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 49 హైదరాబాద్
శుక్రవారం 13 డిసెంబర్ 2024 రూ.15-00
11 జమాది ఉల్ ఆఖిర్ 1446 హిజ్రీ

**తొలిగీటు**

మంచి ప్రవర్తనగల వాడే మీలో అందరికంటే ఉత్తముడు

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




24

## లోపల...

| | | |
|---|---|---|
| బ్యాలట్ పేపర్ | ...... | 04 |
| అబ్రకదబ్ర వ్యవస్థ | ...... | 05 |
| ముహమ్మద్ (స) ప్రవక్తను కీర్తిస్తూ వ్రాసిన హిందూ కవులు | ...... | 07 |
| దివ్యఖుర్ఆన్‌లో మానవ హక్కులు | ...... | 10 |
| మానవాళికి పెనుముప్పుగా వాయు కాలుష్యం | ...... | 12 |
| మౌలానా ఇనాముర్రహ్మాన్ ఖాన్ | ...... | 14 |
| "ఉద్యమ స్ఫూర్తి ప్రదాతలు" | ...... | 15 |
| జీవన మార్గాన్ని చూపే ధర్మం | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| చరితార్థులు–2 : పీర్ ముహమ్మద్ అన్సారి మోన్నిస్ | ...... | 21 |
| హక్కుల హననం మానవతవకు వ్యతిరేకం | ...... | 22 |
| ఆధ్యాత్మిక జీవితంతో మానసిక ఆరోగ్యం | ...... | 26 |
| దివ్యాంగులు రెండింతల ప్రతిఫలానికి అర్హులు | ...... | 27 |
| అసూయ : అపాయం–ఉపాయం | ...... | 28 |
| వేగుచుక్క (కవిత) | ...... | 31 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| గురువు స్థానం ఉన్నతమైనది! | ...... | 34 |

### దేశం ఎటు పోతోంది?




రోజుకు రోజు దేశంలో
పెరుగుతోంది ఉన్మాదం
చూస్కుంటు కూచుంటే
మానవతకు ప్రమాదం!
దేశ పౌరులంత కలిసి
చేయిచేయి కలపండి
ఉన్మాద భావజాలాన్ని
కూకటి వేర్లు పెరకండి!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

## ఆలోచన

# బ్యాలట్ పేపర్

కేరళలో 1982లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మొదట ప్రారంభమయ్యింది. 2004 తర్వాతి నుంచి క్రమబద్ధంగా ఈవియంలే ఎన్నికల్లో ఉపయోగిస్తు వస్తున్నారు. ఇప్పుడు బ్యాలెట్ పేపర్ అందరూ మరిచిపోయారు. ఇప్పుడు మళ్ళీ బ్యాలెట్ పేపర్ కావాలన్న వాదన వినిపిస్తుంది.

మహారాష్ట్రలోని షోలాపూర్, మార్కడ్ వాడి గ్రామస్తులు బ్యాలెట్ పేపరుతోనే ఓటు వేయాలనుకున్నారు. కాని తహశిల్దారు ఓటింగ్ అనుమతి ఇవ్వలేదు. ఎందుకంటే ఈ ఊళ్ళో ఉన్న మొత్తం 1900 ఓట్లలో వెయ్యి ఓట్లు బీజేపీ అభ్యర్థికి ఎలా వెళ్ళాయనే అనుమానాలు ఊరిప్రజలకు ఉన్నాయి. అందుకే మళ్ళీ ఓటింగ్ పెట్టుకున్నారు. కాని అనుమతులు లభించలేదు. భారీ పోలీసు బందోబస్తు కర్ఫ్యూ విధించడం జరిగాయి.

ఈ ఊరిలో ప్రజలు బ్యాలెట్ పేపరుతో మళ్ళీ ఎన్నికలు పెట్టుకున్నారన్న వార్త మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను అనుమానాస్పదంగా మార్చేశాయి. మహారాష్ట్ర ఫలితాలపై కేవలం ప్రతిపక్షాలు మాత్రమే ప్రశ్నలు అడగడం లేదు. సాధారణ ప్రజల్లోను చాలా అనుమానాలున్నాయి. అందుకే మార్కడ్ వాడి ప్రజలు బ్యాలెట్ పేపరుతో మళ్ళీ తమ ఊరిలో ఎన్నికలు నిర్వహించి అనుమానాలు నివృత్తి చేసుకోవాలనుకున్నారు. ఇప్పుడు ఈ ధోరణి దేశంలో కొత్త ఉద్యమానికి ప్రాణం పోసే మలుపు తిరుగుతోంది.

ఎన్నికల ఫలితాలపై అనుమానాలు రావడం చాలా సార్లు జరిగింది. కాని మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై ప్రశ్నలు చాలా తీవ్రమైనవి. అసోసియేషన్ ఫర్ రిఫామ్స్ కూడా సుప్రీంకోర్టులో ఇంతకు ముందు ఒక పిటీషన్ వేసి బ్యాలెట్ పేపరుతో ఓటింగ్ జరగాలని కోరింది. వందశాతం వివిప్యాట్‌ను లెక్కించాలని కోరింది. కాని ఈ విజ్ఞప్తిని సుప్రీం కోర్టు కొట్టివేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే కూడా ఇప్పుడు బ్యాలెట్ పేపరు కావాలని ప్రకటించారు. మహారాష్ట్ర ఎన్నికలపై అనుమానాలన్నీ కేవలం ఈవియంకు సంబంధించినవి కావు. అనేక ఇతర అనుమానాలున్నాయి. అయితే ఈ అనుమానాలన్నింటిని ఈవియం ఖాతాలో వేసి కొట్టేస్తున్నారు.

ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు చాలా ఆలస్యంగానైనా తీర్పు చెప్పింది. ఎలక్టోరల్ బాండ్ల వాస్తవం వెలుగులోకి వచ్చింది. దీనిద్వారా బీజేపీకి అత్యధిక లాభం కలిగిందన్నది కూడా తెలియవచ్చింది. ఎలక్టోరల్ బాండ్ రూపంలో ఎన్నికల ప్రక్రియపై ప్రభావం వేస్తున్నప్పుడు ఎన్ని రకాలుగా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారో ఊహించవచ్చు. పార్లమెంటులో కూడా ఎన్నికల కమీషన్ వైఖరి ప్రస్తావనకు వచ్చింది.

ఈవియంలపై అనేకమంది అనుమానాలు వ్యక్తం చేశారు. వీటిని హ్యాక్ చేసే అవకాశాలు ఎక్కువని ఎలన్ మస్క్ కూడా ట్వీట్ చేశాడు. అమెరికాలో బ్యాలెట్ పేపర్లు ఎందుకు వాడతారు. సాంకేతికంగా వెనుకబడిన దేశం కాదు కదా.

ఎన్నికలను ప్రభావితం చేసే పనులు అనేకవిధాలుగా జరుగుతున్నాయి. హర్యానాలో కాంగ్రెస్ అభ్యర్థిని ఈడీ దాడులు చేసి జైలుకు పంపించింది. మహారాష్ట్రలో అనేక ఆరోపణలు వచ్చాయి. మహారాష్ట్రలో సాయంత్రం ఐదు గంటల వరకు పోలయిన ఓట్లు, ఆ తర్వాత ఐదు గంటల తర్వాత పోలయిన ఓట్ల గురించి చర్చ కూడా జరుగుతోంది. అలాగే పోలయిన ఓట్లు, లెక్కించిన ఓట్ల మధ్య భారీ తేడా గురించి కొందరు నిలదీస్తున్నారు.

ఈ ఆరోపణలపై విచారణలు జరగాలి కదా. ప్రజాస్వామ్యంలో ఎన్నికల విశ్వసనీయతను నిలబెట్టడం చాలా అవసరం. వంద శాతం వివిప్యాట్ లెక్కింపు ఎందుకు చేయలేరు? ఎన్నికల విశ్వసనీయతను పెంచడానికి బ్యాలెట్ పేపరునే మళ్ళీ తీసుకురావడం అవసరమైతే – ఎందుకు చేయకూడదు?

అబ్దుల్ వాహెద్




**భారత జిడిపి** 5.4 శాతానికి పడిపోయిందని జాతీయ గణాంకాల కార్యాలయం వెల్లడించింది. మాన్యుఫాక్చరింగ్ రంగం 2.2 శాతం, మైనింగ్ రంగం కేవలం 0.1 శాతం, వ్యవసాయ రంగం కేవలం 3.5 శాతం మాత్రమే నమోదు చేశాయి.

ఇప్పుడు మనం ఎంత సంపాదిస్తున్నామో, అంతకన్నా ఎక్కువ ఖర్చు పెట్టక తప్పడం లేదు. మీ వద్ద ఉన్న సొమ్ము విలువ నానాటికి తగ్గిపోతోంది. దేశంలో రైతులు, కార్మికులు, నిరుద్యోగుల పరిస్థితి చూస్తే మన ఆర్ధికవ్యవస్థ పరిస్థితి ఏమిటనే ప్రశ్న పుడుతుంది. వికసిత భారతం గురించి ప్రధాని చెప్పిన మాటలు ఆచరణలో కనిపించడం లేదు.

దీనిని ఆర్థిక సంక్షోభస్థితి అనాలా? తెలియదు. అలా అని అధికారికంగా ఎవరూ చెప్పడం లేదు. చాలామందికి 2008 ఆర్థిక సంక్షోభం గుర్తుండే ఉంటుంది. ప్రపంచంలో వివిధ దేశాలు, అమెరికాతో సహా ఈ ఆర్థికమాంద్యంతో విలవిలలాడాయి. కాని భారతదేశంపై ఈ సంక్షోభం పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. దానికి కారణాలు కూడా ఉన్నాయి. అప్పట్లో మన వ్యవసాయ రంగం బలంగా ఉంది. మాన్యుఫాక్చరింగ్ సెక్టర్ చురుగ్గా పనిచేస్తూ ఉండేది. కాని ఇప్పుడు పరిస్థితి ఏమిటి? క్లుప్తంగా చెప్పాలంటే దేశంలో ధరల పెరుగుదలతో పోల్చితే జిడీపీ పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. దేశంలో సర్వీస్ సెక్టర్, కార్పోరేట్ సెక్టర్, బడా పెట్టుబడిదారుల కోసమే విధానాలు రూపొందుతున్నాయి. ఇప్పుడు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు తరలి వెళుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.

డాలర్‌తో పోల్చితే భారత రూపాయి విలువ ఎంత పడిపోయింది? నిరుద్యోగం పెరిగింది. అధిక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇవన్నీ సమస్యలే కాని వీటన్నింటి కన్నా ముఖ్యంగా ఆలోచించవలసిన సమస్య ఒకటుంది. అదేమిటంటే భారత ఆర్థిక వ్యవస్థ పూర్తిగా సర్వీస్ సెక్టర్‌పై ఆధారపడే పరిస్థితులు వస్తున్నాయి. ఈ సర్వీస్ సెక్టర్‌ను నిర్వహిస్తున్న కార్పోరేట్లు లాభాలు పొందుతున్నారు. మరోవైపు భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితి దిగజారుతోంది. ఇటీవల మరో విషయం కూడా ముందుకు వచ్చింది. భారతదేశం చెబుతున్న దిగుమతుల స్థాయి వేరుగా ఉంటుంది. వాస్తవంగా దిగుమతుల స్థాయి వేరుగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టలేని నిస్సహాయత కనిపిస్తోంది.

కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. కొనుగోలు శక్తి తగ్గిపోతే మార్కెటులో వస్తూత్పత్తులను కొనేవాళ్ళు ఉండరు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మరింత సంకటంలో పడుతుంది. చివరకు ఉద్యోగాలు, ఉపాధి లేని స్థితి, అధిక ధరలతో ప్రజలు బతికేది

ఎలా? కేవలం నగదు బదిలీ పథకాల ఆసరాతో బతికే పరిస్థితి వస్తుందా?

లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ నగదు బదిలీ గురించి మాట్లాడారు. ప్రధాని మోడీ దానిపై విమర్శలు గుప్పించారు. దేశప్రగతి వికాసాల గురించి మాట్లాడారు. కాని ఇప్పుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ స్వయంగా నగదు బదిలీ పథకాల ద్వారానే గెలిచిందనే విశ్లేషణలు వచ్చాయి. పరిస్థితి ఇలా ఉంటే ఆత్మ నిర్భర్ భారత్ అనే మాటలకు అర్ధమేముంటుంది?

ఇప్పుడు దేశంలో పరిస్థితి ఏమిటంటే పరిశ్రమల కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడం తగ్గిపోయింది. ఎందుకంటే ఉత్పత్తులను పెంచి మార్కెటుకు తరలించినా కొనుగోలు శక్తి తగ్గిపోయిన పరిస్థితుల్లో అమ్మకాలు కూడా తగ్గిపోతాయి. అయితే మరోవైపు కార్పొరేట్ రుణాలను చూస్తే ఈ సంవత్సరం కూడా లక్ష కోట్లకు మించి రుణాలు రద్దయ్యాయి. బ్యాంకులు ఇచ్చే పర్సనల్ రుణాలు తీసుకునే వారి సంఖ్య కూడా తగ్గిపోయింది. ప్రజల వద్ద డబ్బు చాలా ఉండి రుణాలు తీసుకోవడం లేదనుకుంటే తప్పు. రుణం తీసుకుంటే చెల్లించలేని స్థితిలో ఉన్న భయాల వల్లనే రుణాలు తీసుకోవడం లేదు. వ్యవసాయ రుణాలు కూడా తగ్గిపోయాయి.

ఈ దేశంలో ఆర్థికవ్యవస్థలో కీలకమైనవి బొగ్గు ఉత్పత్తి, గనులు, సిమెంటు, స్టీలు, రిఫైనరీలు, విద్యుత్ వంటి పరిశ్రమలన్నీ ఇప్పుడు మందగించాయి. మైనింగ్ రంగంలో, మాన్యుఫాక్చరింగ్ రంగంలో, విద్యుదుత్పత్తి రంగంలోను ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఈ రంగాలు చాలా కీలకమైనవి. ఈ రంగాలు కాయిలాపడితే మందగిస్తే ప్రభావం ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడుతుంది.

ఇటీవల మరో వార్త వచ్చింది. వరల్డ్ బ్యాంక్ రిపోర్టు ప్రకారం చైనా నుంచి ఇండియాకు దిగుమతుల్లో, భారతదేశం దిగుమతి చేసుకుంటున్న విలువకు, చైనా ఎగుమతి చేస్తున్న విలువకు మధ్య తేడా ఉందట. ఇది ఎలా సాధ్యం? ఎన్ని వస్తువులు కొన్నామో అన్నే వస్తువులు వాళ్ళు పంపాలి. అన్నే వస్తువులు మనం తీసుకోవాలి. కాని తేడా ఉంది. చైనా విషయంలో మనం ఎన్ని మాటలు చెప్పినా నిజానికి 2015 నుంచి 2022 మధ్య కాలంలో చైనాతో వాణిజ్యం రెట్టింపయ్యిందని కొందరు లెక్కలు చెబుతున్నారు. ఈ సంవత్సరం భారతదేశం లెక్క ప్రకారం చైనా నుంచి దిగుమతులు 99.5 బిలియన్ డాలర్లు. కాని, చైనా వరల్డ్ బ్యాంక్‌కు ఇచ్చిన రిపోర్టు ప్రకారం భారత దేశానికి చేసిన ఎగుమతులు 117 బిలియన్ డాలర్లు. ఈ 18 బిలియన్ డాలర్ల తేడా ఎందుకు వస్తుంది?

షిప్పింగ్ గూడ్స్, టెక్స్ టైల్, ఐరన్ అండ్ స్టీల్, మెడికల్ డివైసెస్ మొదలగునవి ఇప్పుడు చైనా నుంచే వస్తున్నాయని తెలుస్తోంది. ఇంతకు ముందు టెలికాం, ఎలక్ట్రానిక్స్ వంటి కొన్ని ఉత్పత్తులు మాత్రమే వచ్చేవి. ఇప్పుడు పరిస్థితి ఏమిటో కాస్త చాట్ జీపీటీ, గూగుల్ వంటి వాటిని అడిగినా తెలిసిపోతుంది. ఇంకో వైపు షేర్ బాజార్ నుంచి విదేశీ పెట్టుబడులు నిష్క్రమిస్తున్నాయని తెలుస్తోంది.

ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రకారం ప్రతి సంవత్సరం దాదాపు కోటికి పైగా కొత్త ఉద్యోగాలు వస్తున్నాయని తెలుస్తోంది. కాని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ ప్రకారం నిరుద్యోగ రేటు 7.2 నుంచి 9 మధ్యలో ఉంది. ఎన్ యస్ యస్ ఓ డాటా ప్రకారం 6.5. నిరుద్యోగ రేటు పెరుగుతుంటే, ప్రావిడెంట్ ఫండ్ డాటా ప్రకారం కొత్త ఉద్యోగాలు ఏమయ్యాయి? అంటే ఈ ఉద్యోగాలు హొటళ్ళలో, దాబాల్లో పని చేసే వెయిటర్లు, పెట్రోలు పంపుల్లో పనిచేసే వారందరినీ తీసుకొచ్చి ఇందులో కలపడం వల్ల ఉద్యోగాల కల్పన పెద్ద సంఖ్యలో కనబడుతుందన్న వాస్తవం బయట పడింది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారందరిని కలిపేసి ఈ నెంబర్లు చూపిస్తున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే ఉద్యోగాలు లేవు, ఉద్యోగాల్లో ఉన్నవారికి వేతనాలు పెరగడం లేదు. అంగన్వాడి, మిడ్డే మీల్స్‌లో పని చేస్తున్న మహిళలకు వేతనాలు ఏ ఏ రాష్ట్రాల్లో పెరిగాయో ఒకసారి దర్యాప్తు చేసి చూడండి. ఈ ఉద్యోగాల్లో మహిళలే ఉన్నారు. వారు చేస్తున్న పనికి వేతనాన్ని పెంచడం లేదు కాని, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో లాడ్లీ బెహన్, లడ్కీ బెహెన్ పేర్లతో నగదు బదిలీ పథకాలు ప్రవేశపెట్టారు. ఇలాంటి నగదు బదిలీ పథకాలు ఏదో ఒక రూపంలో ప్రతి రాష్ట్రంలోను ఉన్నాయి. మరోవైపు ఉద్యోగాల కోసం ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తరలిపోతున్న వారి సంఖ్య పెరుగుతోంది.

ఈ నేపథ్యంలో ఇటీవల ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ భారత మహిళలు కనీసం ముగ్గురు పిల్లల్ని కనాలన్నారు. ఆ విధంగా భారత జాతిని బలోపేతం చేయాలన్నారు. ఈ మాటల్లో మతతత్వ రాజకీయాలను ప్రత్యేకంగా విశ్లేషించనవసరం లేదు. ఆయన ఏ సముదాయాన్ని ఉద్దేశించి చెప్పారో ప్రత్యేకంగా చెప్పనవసరం కూడా లేదు.


ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడం ఎలా అన్న చర్చ నేడు దేశంలో జరగడం లేదు. కాని సంభల్, అజ్మీర్, బదూయిన్ వగైరాల్లో మస్జిదుల క్రింద మందిరాలున్నాయా లేదా అన్న చర్చ బలంగా వినిపిస్తోంది. దేశాభివృద్ధికి ఏ చర్చ అవసరమో ప్రజలే ఆలోచించాలి. ❑

# ముహమ్మద్ (స) ప్రవక్తను కీర్తిస్తూ వ్రాసిన హిందూ కవులు

**- సల్మాన్ హైదర్**

చరిత్రలో ఇతర మత విశ్వాసాల వ్యక్తుల పట్ల అవగాహన, అభిమానం, గౌరవం మతపరమైన సరిహద్దులు దాటి చాటబడినది. ఇస్లాం స్థాపకుడు ప్రవక్త ముహమ్మద్ గౌరవార్థం ప్రశంసలు రచించిన అనేక మంది హిందూ కవుల రచనలలో ఈ విషయం ప్రస్ఫుటమవుతున్నది.

స్తుతులు, లేదా ఖాసిదాస్ (అరబిక్, పర్షియన్) అనేవి మత, రాజకీయ నాయకులకు ప్రశంసలు అందించే ఆచారం. అరబ్ ప్రపంచంలోని ఇస్లామిక్ కవులు ప్రవక్త ముహమ్మద్ స్తుతులను కంపోజ్ చేసిన మొదటివారు అయితే, ఈ సంప్రదాయం దక్షిణాసియాలో కూడా అభివృద్ధి చెందింది. ఇక్కడ ముస్లిం, హిందూ కవులచే ప్రత్యేకంగా మొఘల్ కాలంలో (16 నుండి 18వ శతాబ్దాలు) ఖసీదాలు చేసే eulogies ప్రక్రియ విస్తృతంగా జరిగింది.




భారత ఉపఖండంలో, అనేకమంది హిందూ కవులు ప్రవక్త ముహమ్మద్(స)కు నివాళులర్పిస్తూ (తరచుగా మధురాష్టకమోర్ షహదా Madhurastakamor Shahada అని పిలుస్తారు) ప్రశంసలు రాశారు.

### మీరాబాయి

16వ శతాబ్దపు కవయిత్రి మీరాబాయి ప్రవక్త ముహమ్మద్(స) పట్ల ప్రశంసను వ్యక్తపరిచే పద్యాలను వ్రాసినట్లు తెలుస్తోంది.

మీరాబాయి తన కవిత్వంలో, కొన్నిసార్లు ప్రవక్త ముహమ్మద్ వంటి వ్యక్తుల లక్షణాలను ప్రశంసించింది. మీరాబాయి దైవత్వంలో ఏకత్వం (unity in the divine)ను చాటింది మీరాబాయి తను ఆరాధించే లక్షణాలు నిస్వార్థత, దేవుని పట్ల భక్తి ప్రవక్త ముహమ్మద్ (స) జీవితంలో, బోధనలలో ఉదాహరణగా చూసింది.

### కవి భూషణ్

రాజస్థాన్‌కు చెందిన17వ శతాబ్దపు కవి భూషణ్ అనే కవి, ముహమ్మద్ ప్రవక్త (స) పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు. కవి భూషణ్ వివిధ ముస్లిం పాలకుల ఆధ్వర్యంలో మొఘల్ కోర్టులో ఉద్యోగం పొందాడు. కవి భూషణ్ కవిత్వం తరచుగా హిందూ మరియు ముస్లిం అంశాలను మిళితం చేసింది.

కవి భూషణ్ రచించిన ప్రవక్త ముహమ్మద్ (స) స్తుతులు, ప్రవక్త పాత్ర, నాయకత్వం, దైవిక ప్రేరేపిత వ్యక్తిగా ప్రవక్త

పట్ల ప్రశంసలు కురిపించినవి. కవి భూషణ్ స్తుతులు ప్రవక్త ఆదర్శప్రాయమైన లక్షణాలను గుర్తించాయి. ప్రవక్త ముహమ్మద్ (స) తన అనుచరులకు అందించిన ఆధ్యాత్మిక శక్తిని, మార్గదర్శకత్వాన్ని నొక్కిచెప్పాయి.

తన కొన్ని రచనలలో, కవి భూషణ్ ప్రవక్త ముహమ్మద్(స)ను వివిధ సంప్రదాయాలకు చెందిన ఇతర గొప్ప నాయకులు, సాధువులతో పోల్చారు. కవి భూషణ్ మతపరమైన నేపథ్యంతో సంబంధం లేకుండా జ్ఞానం, ధర్మం పట్ల విశ్వవ్యాప్త గౌరవాన్ని చూపారు. తన కవితా అభివ్యక్తి ద్వారా, భూషణ్ ధర్మం అతీతమైనది అన్నారు. ఈ సందర్భంగా వివిధ విశ్వాసాలలో కనిపించే ధార్మిక భావనను ఉదహరించారు.

## సంత్ రవిదాస్

రవిదాస్, 15వ శతాబ్దపు ప్రముఖ సంత్ కవి, భక్తి ఉద్యమ నాయకుడు, సామాజిక అసమానతలను సవాలు చేసే, కులం, ఆచారాల కంటే భక్తి ప్రాముఖ్యతను చాటే ఆధ్యాత్మిక పాటలకు ప్రసిద్ధి చెందాడు.

సంత్ రవిదాస్ రచనలు ప్రధానంగా దేవుని ఆరాధనపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ, ఆయన రచనలు ప్రవక్త ముహమ్మద్ (స)తో సహా ఇతర విశ్వాసాలకు చెందిన వ్యక్తుల వరకూ విస్తరించినవి.

సంత్ రవిదాస్ నిజమైన ఆధ్యాత్మిక భక్తికి ఉదాహరణగా ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల అభిమానాన్ని వ్యక్తం చేశారని కొంతమంది పండితులు నమ్ముతారు. సంత్ రవిదాస్ తత్వశాస్త్రం, మతపరమైన విభజనలను అధిగమించి, ఒకేఒక, సర్వవ్యాప్త దైవిక సారాంశం ఆలోచనను ప్రోత్సహించినాడు అది ప్రవక్త బోధనలలో ఉంది. సంత్ రవిదాస్ దేవుని ఏకత్వాన్ని కూడా నొక్కి చెప్పాడు.

## స్వర్గదేయో రుద్ర సింహ

17వ శతాబ్దపు అస్సాం రాజు అయిన స్వర్గదేయో రుద్ర సింహ ప్రవక్త ముహమ్మద్ పట్ల తన అభిమానాన్ని వ్యక్తం చేశాడు. రుద్ర సింహ ఇస్లాం బోధనలు, ప్రవక్త వ్యక్తిత్వం ద్వారా బాగా ప్రభావితమయ్యాడని చెబుతారు.

స్వర్గదేయో రుద్ర సింఘా తన ఆస్థానంలోని పండితులు, కవులను వివిధ సంప్రదాయాలకు చెందిన గొప్ప వ్యక్తులను గౌరవించమని ప్రోత్సహించారు. రుద్ర సింఘా కవిత్వం ప్రవక్త ముహమ్మద్(స)ను తన అనుచరులను కరుణ, న్యాయంతో నడిపించిన చిత్తశుద్ధి, వివేకం కలిగిన వ్యక్తిగా ప్రతిబింబిస్తుంది.

## బిహారిలాల్

రాజస్థాన్ ప్రాంతపు 19వ శతాబ్దపు కవి బిహారిలాల్, తన రచనలలో ముహమ్మద్ (స) ప్రవక్త పట్ల గౌరవాన్ని వ్యక్తం చేసినాడు. భక్తి ఉద్యమంతో సంబంధం ఉన్న బిహారిలాల్, హిందూ, ముస్లిం ఇతివృత్తాలను ప్రతిబింబించిన భక్తి పద్యాలకు ప్రసిద్ధి చెందారు. బిహారిలాల్, ప్రవక్త ముహమ్మద్‌ను స్తుతిస్తూ అనేక స్తుతులను కంపోజ్ చేశాడు. ప్రవక్త ముహమ్మద్ (స) లోని కరుణ, వినయం, ఆధ్యాత్మిక బలం వంటి విశేష లక్షణాలను ఎత్తిచూపారు.

బిహారిలాల్ శ్లోకాలలో, ప్రవక్త ముహమ్మద్ (స) తరచుగా ప్రేమ, దయ, దేవుని ఏకత్వాన్ని బోధించే దైవిక ప్రేరణ పొందిన నాయకుడిగా చిత్రీకరించబడ్డారు. మతపరమైన సరిహద్దులను అధిగమించి, అన్ని మతాల ప్రజలను ఉత్తేజపరిచే ప్రవక్త ముహమ్మద్ (స) విశిష్టత బీహారీలాల్‌తో సహా చాలా మందిని ఆకర్షించింది.

## సుభద్ర కుమారి చౌహాన్

సుభద్ర కుమారి చౌహాన్, 20వ శతాబ్ది ప్రారంభంలో ప్రసిద్ధ హిందీ కవయిత్రి, సుభద్ర కుమారి చౌహాన్ జాతీయవాద కవితలు, హిందీ సాహిత్యానికి చేసిన కృషికి ప్రసిద్ధి చెందింది. తన రచనలలో, సుభద్ర కుమారి చౌహాన్ తరచుగా సామాజిక, మతపరమైన అడ్డంకులను విచ్ఛిన్నం చేయడానికి, ఐక్యతను ప్రోత్సహించడానికి ప్రయత్నించింది.

చౌహాన్ కవితలు ఎక్కువగా స్వాతంత్ర్యం, సామాజిక సంస్కరణల ఇతివృత్తాలపై కేంద్రీకృతమై ఉండగా, సుభద్ర కుమారి చౌహాన్ ప్రవక్త ముహమ్మద్‌ను నైతిక అధికారం, న్యాయశీలుడైన వ్యక్తిగా ప్రశంసించింది.

## రవీంద్రనాథ్ ఠాగూర్

నోబెల్ గ్రహీత, ఆధునిక భారతదేశంలో అత్యంత ప్రభావవంతమైన కవులలో ఒకరైన రవీంద్రనాథ్ ఠాగూర్ కూడా ప్రవక్త ముహమ్మద్ పట్ల తన అభిమానాన్ని వ్యక్తం చేశాడు. ఠాగూర్ ప్రవక్తను దైవిక ప్రేరణకు చిహ్నంగా, శాంతి, కరుణ దూతగా చూశాడు.

తన రచనలలో, ఠాగూర్ మతపరమైన సరిహద్దులను దాటి

ఐక్యత, మానవత్వం యొక్క ఏకత్వం ఇతివృత్తాలను తరచుగా అన్వేషించారు. ప్రవక్త గురించి ఠాగూర్ కవితా వ్యక్తీకరణలు ప్రేమ, శాంతి, సామాజిక న్యాయంపై ముహమ్మద్(స) సందేశానికి లోతైన గౌరవాన్ని ప్రతిబింబిస్తాయి. ఠాగూర్ ఇస్లామిక్, సూఫీ సంప్రదాయాలచే ప్రభావితమయ్యాడు. ఇస్లాం, హిందూ మతం ఏకేశ్వరోపాసన సూత్రాల మధ్య సారూప్యతలను తరచుగా అంగీకరించాడు.

## శ్రీ అరబిందో

శ్రీ అరబిందో తత్వవేత్త, కవి, ఆధ్యాత్మిక నాయకుడు, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక వ్యక్తి. భారతదేశంలో ఆధునిక ఆధ్యాత్మిక ఆలోచనకు మార్గదర్శకుడు. శ్రీ అరబిందో భారతీయ ఆధ్యాత్మికతతో పాశ్చాత్య తాత్విక ఆలోచనను ఏకీకృతం చేసినందుకు ప్రసిద్ధి చెందాడు.

శ్రీ అరబిందో ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల కూడా తన అభిమానాన్ని వ్యక్తం చేశాడు. అరబిందో ముహమ్మద్‌ను దైవిక ప్రేరణ, నాయకత్వం మూర్తీభవించిన ఆధ్యాత్మిక నాయకుడిగా చూశాడు. ఇతర గొప్ప ఆధ్యాత్మిక వ్యక్తుల మాదిరిగానే ప్రవక్త కూడా మానవాళికి మార్గనిర్దేశనం చేసే ఉన్నతమైన ఆధ్యాత్మిక వాస్తవికత అభివ్యక్తి అని శ్రీ అరబిందో విశ్వసించారు.

శ్రీ అరబిందో తాత్విక విధానం అన్ని మతాల ఐక్యతను నొక్కి చెప్పింది. ప్రవక్త ముహమ్మద్ వంటి వ్యక్తుల ఆధ్యాత్మిక లోతును గుర్తించింది. ఇస్లాం మతంపై అరబిందో రచనలు విస్తృతం కానప్పటికీ, ప్రవక్త నైతిక ధైర్యాన్ని, సామాజిక న్యాయం పట్ల ఆయనకున్న నిబద్ధతను, వివేకం, కరుణతో నడిపించే సామర్థ్యాన్ని తరచుగా హైలైట్ చేస్తాయి.

హిందూ కవులు స్తుతులు రాయడం వెనుక ఉన్న ముఖ్య కారణాలలో ఒకటి భారతదేశంలో సూఫీయిజం ప్రభావం. సూఫీయిజం, ప్రేమ, సహనం, దైవిక ఐక్యత అన్వేషణను నొక్కి చెప్పింది, ఇది చాలా మంది హిందువులలో ప్రస్ఫుటమవుతుంది.

హిందూ కవులు, ముఖ్యంగా భక్తి ఉద్యమకారులు, సూఫీ సాధువుల బోధనలచే ప్రభావితమైన వారు, ప్రవక్త ముహమ్మద్ (స) జీవితం, ఆయన బోధనలలో ఒక్క దేవుడిపై భక్తి, సేవా జీవితం, సామాజిక న్యాయ సందేశం కనుగొన్నారు.

ప్రవక్త ముహమ్మద్‌ను కీర్తిస్తూ హిందూ కవులు వ్రాసిన స్తుతులు మతపరమైన విభజనలను అధిగమించాయి. వారు దైవిక జ్ఞానం, కరుణ, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం వ్యక్తిని ప్రవక్త ముహమ్మద్‌లో చూశారు.

ప్రవక్త ముహమ్మద్‌కు నివాళులర్పించడం ద్వారా, హిందూ కవులు ఆధ్యాత్మిక ఐక్యత విస్తృత సంప్రదాయానికి దోహద పడ్డారు, ఇది సత్యం, న్యాయం, దైవిక అనుసంధానం కోసం భాగస్వామ్య మానవ అన్వేషణను అంగీకరిస్తుంది. ★


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# ముఖ్య ఆశయాలు

- ☛ సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ☛ ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ☛ ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ☛ ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

# దివ్య ఖుర్‌ఆన్‌లో మానవ హక్కులు

- నసీరా బేగం

**అల్లాహ్** మానవుణ్ణి సృష్టితాలన్నింటిలో మహోన్నతునిగా సృష్టించాడు. సమస్త జీవరాశులపై అతనికి ఉన్నతమైన స్థానాన్ని కల్పించాడు. సర్వసృష్టి కేవలం మానవుని కోసమే సృష్టించబడింది. అతని కోసమే ఈ మొత్తం సృష్టి అలంకరించబడింది. అంతేకాదు, ఈ సృష్టి మొత్తాన్ని అతనికి వశపరచడం కూడా జరిగింది. అతను ఈ సృష్టిలోని అసంఖ్యాకమైన వస్తువులను తన కోసం ఉపయోగించుకునే శక్తి సామర్థ్యాలను కూడా అతనికి ప్రసాదించటం జరిగింది. ఈ విషయాన్ని అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు:

సముద్రాన్ని మీకు వశపరచినవాడు అల్లాహ్‌యే కదా! ఆయన ఆదేశానుసారం అందులో ఓడలు ప్రయాణం చేయటానికి, మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటానికి, కృతజ్ఞులు కావటానికి, భూమిలోని, ఆకాశాలలోని సకల వస్తువులనూ ఆయన మీకు వశపరిచాడు. ఇదంతా తన వద్ద నుండే. ఆలోచనాపరులకు ఇందులో గొప్ప సూచనలు ఉన్నాయి. (45: 12,13)

మరొకచోట అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : భూమినీ, ఆకాశాలను పుట్టించినవాడు, ఆకాశం నుండి నీళ్ళను కురిపించినవాడూ, దానిద్వారా మీ ఆహారం కొరకు రకరకాల ఫలాలను సృష్టించినవాడు, తన ఆజ్ఞానుసారం సముద్రంలో నడవాలని పడవను మీ సేవకై మీకు లోబరచినవాడు, నిరంతర ప్రయాణం చేస్తూ పోతూ ఉన్న సూర్యచంద్రులను మీ సేవకై మీకు లోబరచినవాడు, మీరు అడిగిన సమస్తాన్నీ మీకు ఇచ్చినవాడు అల్లాహ్‌యే. మీరుగనక అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలిస్తే లెక్కించలేరు. నిజంగా మానవుడు నీతి లేనివాడు, కృతఘ్నుడు. (దివ్య ఖుర్‌ఆన్ 32: 34)

ఇంకా అల్లాహ్ అతనికి అందమైన, సౌకర్యవంతమైన, దృఢమైన శరీరాన్ని ప్రసాదించాడు. ఆలోచించే, అర్థం చేసుకునే, అవగాహన చేసుకునే జ్ఞానాన్ని కూడా ప్రసాదించాడు. ఈ శక్తిసామర్థ్యాల కారణంగానే అతను అభివృద్ధి దిశ వైపు పరుగులు పెడుతూ దినదినాభివృద్ధి చెందుతున్నాడు. తన హావభావాలను వ్యక్తపరిచే గుణాన్ని కూడా ప్రసాదించాడు. ఇంకా రకరకాల భాషలను కూడా సృష్టించాడు. వాటిని నేర్చుకునే గుణాన్ని కూడా పుట్టుకతోనే ప్రసాదించాడు. దీని కారణంగా మనిషి ఇతర సృష్టితాలకంటే భిన్నమైన సృష్టి కలవాడు. ఈ విషయాన్ని అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు: ఓ మానవుడా! పరమదాత అయిన నీ ప్రభువును గురించి ఏ విషయం నిన్ను మాయలో పడవేసింది? ఆయనే నిన్ను సృష్టించాడు. ఎలాంటి లోపం లేకుండా నిన్ను తీర్చిదిద్దాడు. నిన్ను తగినరీతిలో పొందికగా రూపొందించాడు. తాను తలచిన ఆకారంలో నిన్ను క్రమబద్ధంగా మలిచాడు (82: 6-8). ఆయనే మానవుణ్ణి సృష్టించి అతనికి మాట్లాడటం నేర్పాడు. (55: 3,4)

కారుణ్య ప్రభువైన అల్లాహ్ ప్రతి మానవుడికి ఈ విధంగా గౌరవాన్ని ప్రసాదించాడు. మానవులందరూ ఒకరికొకరు సోదరులనీ, వారు ఒకరికొకరు గౌరవించుకుంటూ, ప్రేమించుకుంటూ కలసిమెలసి ఉండాలని బోధించాడు. కులమత భేదాలు ఉండకూడదని దాని కారణంగా పరస్పరం విభేదాలకు, వివక్షలకు గురికాకూడదని కూడా బోధించాడు. సర్వసృష్టికర్త ఒక్కడే అయినప్పుడు ఆయన సృష్టించిన మానవులందరూ కలిసికట్టుగా ఉండాలని ఆదేశించాడు. ఈ ఆదేశాన్ని దైవప్రవక్తలందరూ ఆచరించి చూపారు. ప్రజలను ప్రేమించి ఆదర్శాన్ని పంచారు. వారు వివక్షలకు పాల్పడలేదు, ద్వేషాన్ని రగల్చలేదు. పరమత సహనాన్ని నేర్పారు. ఏ మతానికి చెందినవారైనా సరే వారిని ఎల్లప్పుడూ గౌరవించారు. దీనికి సంబంధించిన గాథలు ఎన్నో మనకు చరిత్రలో కనిపిస్తాయి. ఒకసారి దైవప్రవక్త ముహమ్మద్(స) తన సహచరులతో కలిసి ఒకచోట కూర్చుని ఉన్నారు. అంతలో ఒక యూదుని శవాన్ని అంత్యక్రియల కోసం ప్రజలు మోసుకుని వెళుతూ అటునుంచి రావటాన్ని చూసి దైవప్రవక్త(స) వెంటనే గౌరవ సూచనగా లేచి నిలబడ్డారు. అక్కడ ఉన్న ఆయన(స) గారి సహచరులు, ఓ దైవప్రవక్తా(స)! అది ఒక యూదుని శవం కదా! అన్నారు. దానికి దైవప్రవక్త(స) "అయితే అతను మనిషి కాడా?" అని వారినే ప్రశ్నించారు.

ఈ విధంగా ఇస్లామ్ ధర్మం తన అనుయాయులకు మానవ హక్కులను గురించి వివరంగా తెలియజేసింది. ఇస్లామ్ దృష్టిలో ప్రతి మానవుడు సమానమే. ఒకవేళ వారి హక్కులను కొల్లగొట్టినట్లయితే అతను అల్లాహ్ ముందు బాధ్యుడు. దానికి సమాధానం చెప్పవలసి ఉంటుంది. దానికి శిక్ష తప్పకుండా అనుభవించవలసి ఉంటుంది.

మొట్టమొదటిది మానవ ప్రాణానికి ఎనలేని ప్రాముఖ్యత ఇవ్వబడింది. దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయబడింది; హత్యకు బదులుగా గాని లేక కల్లోలాన్ని వ్యాపింపజేసినందుకు గాని కాక మరే కారణం వల్లనైనా ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్టే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే. (5: 32)

రెండోది; మానవుల ధనానికి, ఆస్తిపాస్తులకు రక్షణ ఇవ్వబడింది. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; మీలో ఒకరి ఆస్తిని మరొకరు అన్యాయంగా కబళించకండి. అక్రమమైన రీతిలో ఇతరుల ఆస్తిలో కొంతభాగం కాజేసే అవకాశం లభిస్తుందేమో అనే దురుద్దేశ్యంతో దానిని న్యాయ నిర్ణేతల వద్దకు తీసుకుపోకండి.

మూడోది; మానవుని గౌరవానికి కూడా రక్షణ ఇవ్వబడింది. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : విశ్వాసులారా! పురుషులు ఇతర పురుషులను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠులై ఉండవచ్చు. అలాగే స్త్రీలు ఇతర స్త్రీలను ఎగతాళి చేయకూడదు. వీరికంటే వారే శ్రేష్ఠురాలై ఉండవచ్చు. ఒకరికొకరు ఎత్తి పొడుచుకోకండి. ఒకరినొకరు చెడ్డ పేర్లతో పిలుచుకోకండి. (49: 11)

నాలుగోది; కుటుంబ జీవితానికి కూడా రక్షణ ఇచ్చింది. ఇస్లామ్ మౌలిక హక్కుల ప్రస్తావనలో మనిషి తన కుటుంబ జీవితానికి వ్యక్తిగతంగా, సురక్షితంగా ఉంచుకునే హక్కును ప్రసాదించింది. ఈ విషయం దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా తెలియజేయబడింది : విశ్వసించిన ప్రజలారా! మీ ఇళ్ళల్లోకి తప్ప ఇతరుల ఇళ్ళల్లోకి ప్రవేశించకండి, ఇంటివారి అంగీకారం పొందనంతవరకు, ఇంటి వారికి సలామ్ చేయనంతవరకు. ఈ పద్ధతి మీకు ఎంతో ఉత్తమమైనది. (24: 27)

ఇంకా దానితోపాటు ఒకరినొకరి విషయాలు గోప్యతకు భంగం కలిగించకూడదని, అనుమానించకూడదని కూడా తెలియజేయబడింది. దాని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; విశ్వాసులారా! అతిగా అనుమానించటం మానివేయండి. కొన్ని అనుమానాలు పాపాలు అవుతాయి. గూఢచారులుగా వ్యవహరించకండి. మీలో ఎవరూ ఎవరినీ పరోక్షంగా నిందించరాదు. (49: 12)

మనిషి వ్యక్తిగత జీవిత రక్షణ గురించి ఒక ప్రముఖ సంఘటన ఇలా ఉంది : ఒకరోజు రాత్రి ఖలీఫా హజ్రత్ ఉమర్(ర) రహస్యంగా ప్రజల సమస్యలను తెలుసుకోవటానికి సంచరిస్తూ ఉండగా ఒక ఇంటిలోనుంచి పాటలు పాడుతూ ఉన్న స్వరాన్ని విన్నారు. అక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకోవడానికి గోడ మీద నుంచి తొంగి చూశారు. అక్కడ ఒక స్త్రీ ఒక పురుషుడు ఉన్నారు. త్రాగేందుకు అక్కడ సారాయి కూడా ఉంది. అది చూసిన హజ్రత్ ఉమర్(ర) గోడ దూకి ఓ దైవ విరోధి! ఏమిటి నీవు చేసే ఈ దైవాజ్ఞల ఉల్లంఘనను అల్లాహ్ బహిరంగపరచడని భావించావా? అని కోపంగా గట్టిగా ప్రశ్నించారు.

దానికి అతను, 'ఓ అమీరుల్ మోమినీన్! మీరు కాస్త ఆగండి. త్వరపడకండి. నేను ఒక్క పాపం చేస్తే మీరు మూడు పాపాలు చేశారు. మొదటిది; అల్లాహ్ ఒకరి కూపీలు మరొకరు లాగకండి అని ఆదేశించాడు. మీరు నా రహస్య కార్యం కూపీలు లాగారు. రెండోది; అల్లాహ్ ఇతరుల ఇండ్లల్లోకి ముఖద్వారంలోనుండి ప్రవేశించండి అని ఆదేశించాడు. మీరైతే వెనుక నుండి గోడ దూకి మరీ ప్రవేశించారు. మూడోది; అల్లాహ్ ఇతరుల ఇళ్ళల్లోకి అనుమతి తీసుకుని ప్రవేశించండి అని సెలవిచ్చాడు. మీరైతే నా అనుమతి తీసుకోకుండానే నా ఇంట్లో ప్రవేశించారు.

అతని ఈ మాటలు విన్న హజ్రత్ ఉమర్(రజి) తన తప్పును తెలుసుకున్నారు. అతనికి హితబోధ చేసి ఇకనుంచి సత్కార్యాల మార్గాన్ని అవలంబించాలని అతని నుండి వాగ్దానం తీసుకున్నారు. ఖలీఫాల కాలంలో ఖలీఫా తప్పులను కూడా ఎత్తి చూపే అనుమతి సాధారణ ప్రజలకు కూడా ఉండేది. ఖలీఫాలు కూడా తన తప్పును తెలుసుకుని దైవభయంతో వణికిపోయేవారు.

ఐదోది; అన్యాయం, దౌర్జన్యం జరుగుతుంటే దానికి వ్యతిరేకంగా తన గళాన్ని లేవనెత్తే అధికారాన్ని కూడా అల్లాహ్ మానవులకు ప్రసాదించాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు; అన్యాయం జరిగితే తప్ప మనిషి చెడు పలకటాన్ని అల్లాహ్ ఇష్టపడడు. అల్లాహ్ అన్నీ వినేవాడు, అన్నీ తెలిసినవాడును (4: 148) అంటే అన్యాయం జరిగితే చెడు పలికే హక్కు ఉంది. దుర్మార్గుడికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసే హక్కు పీడితులకు లభిస్తుంది.

ఆరోది; మనిషి స్వేచ్ఛకు రక్షణ. ఇస్లామ్ రాజ్యంలో మనిషి నేరం నిరూపణ కాకపోతే ఏ పౌరునికీ శిక్ష వేయటం జరగకూడదు. లేదా అతనిని జైలులో బంధించి అతని స్వేచ్ఛా జీవితానికి భంగం కలిగించ కూడదు. న్యాయం విషయంలో పౌరులందరూ సమానులే. వారు ఎంత పెద్దవారూ, గొప్పవారు అయినా సరే. దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయబడింది; ముస్లిములారా! ప్రజల మధ్య తీర్పు చేసేటప్పుడు న్యాయం చేయండి. (4: 58)

విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. ఏదైనా వర్గంలో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనై న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి దగ్గరైనది. అల్లాహ్‌కు భయపడుతూ వ్యవహరించండి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు పూర్తిగా తెలుసు. (5: 7,8)

ఏడోది; మతావలంబన విషయంలో ఇస్లామ్‌లో ఎటువంటి బలాత్కారం లేదు. ఈ విషయాన్ని దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవీయటం జరిగింది. ధర్మం విషయంలో నిర్బంధం కానీ, బలాత్కారం కానీ లేవు. (2: 256)

ఎనిమిదోది; ప్రజల ధనాన్ని రక్షణ ఆదేశాలు, ఆ ధనాన్ని ఖర్చు చేసే పద్ధతి ఆదేశాలు ఇచ్చింది. దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా ఆదేశించబడింది : అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువుల కొరకు, అనాధుల కొరకు, నిరుపేదల కొరకు, బాటసారుల కొరకు, సహాయం చెయ్యండి అని అర్థించేవారి కొరకు, ఖైదీలను విడుదల చెయ్యటానికి వ్యయపరచటం సత్కార్యం. (2: 177) ఈ విధంగా మనిషి తన సంపదను ఖర్చు చేసినట్లయితే అతని సంపద పరలోకంలో భద్రపరచబడి ఉంటుంది. ఇహలోకంలో శాంతి, సమృద్ధి జరుగుతుంది.



# మానవాళికి పెను ముప్పుగా వాయు కాలుష్యం

తహూరా సిద్దీఖా

**వాతావరణ** మార్పులు, భారీ నిర్మాణాలు, పెరిగిన వాహనాల వినియోగం, పట్టణీకరణ, పారిశ్రామిక వ్యర్థాలు తదితర కారణాల వల్ల దేశంలో గాలి విషపూరితమైంది. దేశ రాజధాని ఢిల్లీ మాత్రమే కాకుండా నేడు అనేక నగరాలు తీవ్ర వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయి. ప్రపంచ బ్యాంకు ప్రకారం... భారతదేశ జనాభాలో అత్యధిక శాతం మంది పార్టిక్యులేట్ మ్యాటర్ 2.5 నీడలో నివసిస్తున్నారు. అంటే అత్యంత హానికరమైన వాయువులను పీలుస్తూ జీవిస్తున్నారు. వాయు కాలుష్యం వల్ల మనుషుల మరణాలు సంభవించడంతో పాటు దేశాల ఆర్థిక వ్యవస్థలు క్షీణిస్తున్నాయి. 2021లో వాయు కాలుష్యం వల్ల భారతదేశంలో 1.2 మిలియన్ల మంది మరణించారు. దేశం 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టపోయింది.

స్వచ్ఛమైన గాలి లభ్యత మనుషుల ప్రాథమిక హక్కు. అయినప్పటికీ, వాయు కాలుష్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి ఆ హక్కు లభించడం లేదు. కార్బన్ మోనాక్సైడ్ (CO), నైట్రోజన్ డయాక్సైడ్ (NO2), సల్ఫర్ డయాక్సైడ్ వాయు కాలుష్యానికి ప్రధాన కారణాలు. ఒక వెంట్రుక కంటే ముప్పై రెట్లు సూక్ష్మంగా ఉండే ఆర్టిక్యులేట్ పదార్థం కలిగిన PM-10, PM-2.5 కణాలు శ్వాస ద్వారా మనుషుల్లోకి ప్రవేశించి రక్తంలో కలిసి గుండె, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. వాయు కాలుష్యం గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి రోగాలకు కారణమవుతున్నది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వాయు కాలుష్యం ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

### ప్రభుత్వం చేస్తున్న కృషి

2024 నాటికి పర్టిక్యులేట్ మ్యాటర్ 10 (PM-10) స్థాయిలను తగ్గించే లక్ష్యంతో భారత ప్రభుత్వం జనవరి 2019లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (NCAP)ని ప్రారంభించింది. తర్వాత లక్ష్యాన్ని 2025-26 వరకు పొడిగించారు. NCAP కింద, 2023-24లో 131 నగరాలు వాయు కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించాయి. 51 నగరాలు PM-10 స్థాయిలలో ఇరవై శాతానికి పైగా తగ్గింపును నమోదు చేశాయి. అయితే 18 నగరాలు మాత్రమే నేషనల్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్స్ (NAAQS)కు అనుగుణంగా ఉన్నాయి.

### వాయు కాలుష్యం కట్టడి అందరి బాధ్యత

వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలందరూ కృషి చెయ్యాలి. సంప్రదాయేతర ఇంధన వనరులను వినియోగించుకోవాలి. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ)

వినియోగాన్ని ఎక్కువ చేయాలి. ఫ్యాక్టరీలు ఉద్గారాలను తగ్గించేలా కఠిన నిబంధనలను అమలు చేయాలి. అడవులను పెద్ద యెత్తున పెంచి ఉన్న అడవులను సంరక్షించాలి. పర్యావరణ పరిరక్షణ, వాయు కాలుష్య నివారణ, తగ్గింపుపై విద్యార్థుల్లో అవగాహన పెంచి వారిని ఈ ప్రక్రియలో భాగస్వాములు చేయాలి. పర్యావరణ అనుకూల చర్యలను అనుసరించే పరిశ్రమలకు ఆర్థిక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. వాయు కాలుష్య నియంత్రణ చట్టాలను సమర్థంగా, కఠినంగా అమలు చేయాలి. క్లీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టులను విస్తరించాలి.

## సాంకేతికత పాత్ర

వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో సాంకేతికత ఒక శక్తివంతమైన సాధనం. గాలి నాణ్యతను పర్యవేక్షించడానికి ఆధునిక సెన్సార్లు, పరికరాలను వినియోగించాలి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (IoT), కృత్రిమ మేధ(AI) ఉపయోగించి వాయు కాలుష్యం యొక్క తక్షణ ప్రభావాన్ని విశ్లేషించాలి.

## ప్రజల భాగస్వామ్యం కీలకం

- ప్రైవేట్ వాహనాలకు బదులుగా ప్రజా రవాణాను ఎక్కువగా ఉపయోగించుకొనేలా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలి.
- ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలలో ప్రజలు పాల్గొనడాన్ని ప్రోత్సహించాలి.
- వ్యక్తిగత స్థాయిలో, పర్యావరణ నష్టాన్ని తగ్గించేలా ప్రజలు తమ జీవనశైలిని మార్చుకోవాలి.
- నీరు, విద్యుత్తు వృథాను నివారించాలి.
- వాహనాల అనవసర వినియోగాన్ని తగ్గించాలి.
- వ్యర్థాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహించాలి.

విద్యా సంస్థలు, మీడియా పర్యావరణ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. సహజ వనరుల పరిరక్షణ మనందరి ఉమ్మడి బాధ్యత అని వారికి తెలియజేయాలి. మనమంతా మన బాధ్యతలను నెరవేరుస్తూ, ఇస్లాం బోధించిన పర్యావరణ పరిరక్షణ సూత్రాలను అనుసరిస్తే, మన జీవితాలను మెరుగుపరచడమే కాకుండా, భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన, సంపన్నమైన, స్వచ్ఛమైన ప్రపంచాన్ని అందించిన వారమవుతాము.

### ఇస్లాం సందేశం

'మరికాసేపట్లో ఈ ప్రపంచం అంతమైపోతుందని తెలిసినా మీ చేతిలో మొక్క ఉంటే దానిని నాటండి' అని అన్నారు ప్రవక్త (స). వృక్ష సంపద విలువను తెలియజేయడానికి ఇంతకంటే గొప్ప ఉపమానం మరొకటి ఏముంటుంది. 'ప్రతి వ్యక్తీ ఒక మొక్క నాటినా... దాని ఫలాలను పక్షిగానీ, పశువులుగానీ, మనుషులుగానీ తిన్నా.. నాటిన వ్యక్తికి ఎంతో పుణ్యం లభిస్తుంది' అని చెప్పి మొక్కలు నాటడాన్ని 1500 ఏళ్ల క్రితమే ప్రోత్సహించారు ముహమ్మద్ ప్రవక్త. మనిషి ఈ ధరిత్రిపై అడుగు పెట్టకముందే ఆ దైవం ఈ ప్రపంచాన్ని ఎన్నో రకాల వృక్ష జాతులతో అలంకరించాడని ఖురాన్ చెబుతుంది. వృక్ష సంపద గురించి ఇస్లాం ధర్మంలో అపార జ్ఞానసంపద ఉంది. 'ఎవరికీ చెందని ఓ బంజరు నేలను పంట పొలంగా మార్చిన వ్యక్తికే ఆ భూమి చెందుతుంది...అని చెప్పి సేద్యాన్ని ప్రోత్సహించారు ప్రవక్త. యుద్ధ సమయంలోనూ నీడనిచ్చే చెట్లను నరకరాదని, శత్రువుకు చెందిన పంటపొలాలను నాశనం చేయకూడదని చెప్పారు. నీడనిచ్చే చెట్ల కింద మలమూత్రాలు చేయడాన్ని ప్రవక్త (స) తీవ్ర నేరంగా చెప్పారు. నదీజలాలలో మలమూత్రాలు చేసేవారిని శపించారు. దేహానికి ఆత్మ ఎలాంటిదో పర్యావరణానికి చెట్టు ఆత్మలాంటిది. మనిషికి ప్రాణవాయువు అందించే చెట్టును కాపాడుకుంటేనే మనిషి జీవితం సుభిక్షం అవుతుందంటారు ప్రవక్త.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# మౌలానా ఇనాముర్రహ్మాన్ ఖాన్

- ఎస్.ఎం.మలిక్

మధ్యప్రదేశ్‌లో భోపాల్ జమాఅత్ స్థానిక అమీర్‌గా, కేంద్ర సలహా మండలి సభ్యునిగా చతుర సంభాషణకు పేరు మోసిన వ్యక్తి మౌలానా ఇనాముర్రహ్మాన్ ఖాన్ గారు. కొన్ని మరువ లేని సంఘటనలు మీతో పంచుకుందామని ఈ లేఖనం.

ఒక సారి భోపాల్ నగరంలో జమాఅత్ ముఖ్య సభ్యుల ఓ సమావేశం జరిగింది. అది సైద్ధాంతిక చర్చల సమావేశం. అందులో నిర్ణీత వ్యక్తులు ఒక్కొక్కరే తమ అభిప్రాయాలను వెల్లడించిన తరువాత ప్రతిసారి ఆ వ్యక్తికి పాల్గొన్న వారు ప్రశ్నలడిగే లేదా దానికి ప్రతిగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. ఆ చర్చలు చాలా ఉత్సాహ వంతంగా, ఆసక్తికరంగా సాగాయి. డాక్టర్ నిజాతుల్లా సిద్దీకీ గారు తన ప్రసంగం ముగించిన తరువాత ప్రథమంగా ఇనామ్ గారు లేచి మైక్ వద్దకు వెళ్లి, "మా ప్రాంతంలో ఓ నానుడి ఉంది. 'అమ్ముకునే అమ్మ మాటకారి అయితే పుల్లని రేగుపళు కూడా అమ్ముడు పోతాయి.' మా మిత్రుని పరిస్థితి అలాగే ఉంది. మంచి వక్త కాబట్టి తన వాదనను బహు చాకచక్యంగా ముందుంచారు. అందరూ ముగ్ధులయి విన్నారు. అయితే అవి పుల్లని పళ్ళు!" అంటూ మొదలుపెట్టారు. అంతే, స్వయంగా నిజాతుల్లా గారు కూడా నవ్వును ఆపుకోలేక పడి పడి నవ్వారు.

అలాగే ఒక సారి జమాఅత్ ప్రతినిధి మండలి సమావేశంలో మౌలానా అబుల్ లైస్, అమీర్ జమాఅత్ అనారోగ్యం వల్ల ప్రారంభంలో పాల్గొనలేక పోయారు. ఆ పైన ఆయన నమాజ్ సమయానికి కాస్త ముందు వచ్చి అప్పటి వరకు జరిగిన కార్యక్రమాన్ని గురించి అడిగారు. ఆ రోజు నిర్దిష్ట కార్యక్రమానికి బదులు ఏదో అసంబద్ధ విషయం పైన చర్చలు జరిగాయి. అప్పుడు నేను, ఇంకా ఇద్దరు యువకులు అది మన విషయం కాదు అని వాదించినా పెద్దలు మనల్ని కూచోబెట్టారు. అదంతా గమనించి మౌలానా ఆగ్రహ దృక్కులతో సభను కలియజూశారు. అప్పటి వరకు అధ్యక్షత వహించిన వారిని నిలదీశారు. ఇదంతా కార్యక్రమంలో ఉందా? అని ప్రశ్నించారు. అనుభవజ్ఞులయిన పెద్దల నందరినీ పేరు పేరున అడిగారు, ఇదంతా జరుగుతూ ఉన్నా మీరు చూస్తూ కూర్చున్నారా? అని ప్రశ్నించారు. వారిలో ఇనామ్ గారు కూడా ఉన్నారు. మౌలానా గారు మొత్తం జరిగిన కార్యక్రమాన్ని అసంబద్ధ మయినదని డిలీట్ చేయించారు.

సభ ముగియగానే అందరూ నమాజ్ కొరకు బయలుదేరి వెళ్ళారు. నేను కాస్త ఆలస్యంగా, నా సమయానికి అనువయిన మస్జిద్‌కు వెళ్ళి తిరిగి వస్తుండగా మౌలానా ఇనాముర్రహ్మాన్ గారు లోనుంచి బయటికి వస్తూ కనిపించారు. నేను సలామ్ చేసిన తరువాత యాదృచ్ఛికంగా అడిగాను, బయటకి వెళ్ళు తున్నారా అని. ఆయన ఒక సెకను ఆగి అద్భుతంగా తల ఆడిస్తూ, చిరునవ్వుతో, "నేను అంత సులువుగా బయటికి వెళ్ళి పోతానని అనుకున్నారా? అలా వెళ్ళేవాణ్ణి కాను" అని, లోగడ సభలో జరిగిన రభసను దృష్టిలో ఉంచుకుని వెటకారంగా అన్నారు! ఆయన అటువంటి చతురుడు!

మౌలానా మౌదూదీ మరణ సందర్భంలో మనదేశం నుండి పాకిస్తాన్ వెళ్ళిన వారిలో మౌలానా ఇనాముర్రహ్మాన్ ఖాన్ గారు కూడా ఉన్నారు. అక్కడ మౌలానా మౌదూదీ సంతాప సభ జరిగింది. అందులో అందరికీ మూడేసి నిమిషాల సమయమే ఇచ్చారు. భారత బృందం పక్షాన మౌలానా అబ్దుల్ అజీజ్ మాటలాడారు. ఆయన నిజంగానే మూడు నిమిషాల వ్యవధిలో సంక్షిప్తంగా మౌలానా మౌదూదీ జరిపిన మహా సంగ్రామాన్ని పూర్తి చేశారు. అప్పటి ప్రసంగాల్లో అన్నింటికన్నా ధీటుగా ఆయన ప్రసంగమే అందరికీ నచ్చింది. అందరూ మెచ్చుకున్నారు కూడా.

అయితే లాహోర్ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు ఆ మూడు నిమిషాల వ్యవధిలోనే ఏమీ చెప్పక పోయినా అంతా చెప్పగలిగాడు! ఆ సభ ముగిసిన తరువాత అబ్దుల్ అజీజ్ గారిని కలిసినప్పుడు ఆయన్ని సంబోధించి, మౌలానా ఇనాముర్రహ్మాన్ గారు, "అజీజ్ గారూ, నేను మీ ప్రసంగం విని మీకు వంద మార్కులు ఇచ్చి వేశాను. అయితే ఈ అబ్బాయి ఉన్నాడు చూశారు, విద్యార్థి నాయకుడు, 120 మార్కులు కొట్టేశాడు!" అన్నారు.




# "ఉద్యమ స్ఫూర్తి ప్రదాతలు"

పుస్తక సమీక్ష
review

**సమీక్ష: షేక్ అబ్దుల్ సమద్, నంద్యాల**

**మండపేటకు చెందిన** ప్రముఖ రచయిత, అనువాదకులు ముహమ్మద్ షరీఫ్ జమాఆతె ఇస్లామీ హింద్ ఆ.ప్ర రాష్ట్ర సలహా మండలి సభ్యులు. అనేక పుస్తకాలు తెలుగులో అనువదించారు. జమాఆతె ఇస్లామీ హింద్ కేంద్ర కార్యాలయం నుండి వెలువడే ఉర్దూ మాసపత్రిక 'జిందగీ నౌ" వ్యాసాలను తెలుగులో అనువదిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో జనాబ్ షరీఫ్ జమాఆతె ఇస్లామీ హింద్ సంయుక్త తెలుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సభ్యులుగా వివిధ దశల్లో ఉద్యమంలో పని చేసిన 25 మంది సంక్షిప్త సమాచారం సేకరించి కూర్పు చేసి "ఉద్యమ స్ఫూర్తి ప్రదాతలు" అన్న పుస్తకానికి రూపం ఇచ్చారు. జమాఆతె ఇస్లామీ ఏర్పడి 75 వసంతాలు నిండిన ఈ దశకంలో, హైదరాబాద్‌లో డిసెంబర్ 15 –17 తేదిలలో జమాఆతె ఇస్లామీ హింద్ జాతీయ మహాసభలు జరిగిన తరుణంలో ఈ పుస్తకం ఆవిష్కరించటం ఓ ప్రత్యేకతను సంతరించుకుంది. మండపేట రఫత్ పబ్లికేషన్స్ ద్వారా 90 పేజీలతో ఈ పుస్తకం ప్రచురించబడింది. జమాఅత్‌లో సభ్యులుగా వివిధ బాధ్యతలతో తమ సేవాతత్పరత చాటుకుని, ఈ లోకం వీడిన, తమ ఉనికి నిరంతరం భావితరాలకు గుర్తు ఉండే విధంగా స్ఫూర్తి ప్రదాతల జీవితాలను పుస్తక రూపం ఇచ్చిన షరీఫ్ గారి ఆలోచన సరళి అభినందనీయం. పుస్తకం మొదటి పేజీలోనే 25 మంది త్యాగధనులకు అంకితం ఇస్తూ వారు ఉద్యమమే ఊపిరిగా, దైవ ప్రసన్నత, పరలోక సాఫల్యాలే లక్ష్యంగా పని చేసిన తీరును గుర్తు చేసారు. ఈ పవిత్ర గొప్ప ఉద్యమంలో పని చేస్తూ అల్లాహ్ సన్నిధికి చేరుకున్న ప్రముఖుల జీవిత చరిత్ర భవిష్యత్ తరాలకు అందివ్వాలనే రచయిత తపన, అసువులు బాసిన యోధుల సమాచార సేకరణ షరీఫ్ గారి ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనం. ఆ.ప్ర అమీరే హల్ఖా జనాబ్ ముహమ్మద్ రఫీఖ్ గారు సందేశం ఇస్తూ ఉద్యమ స్ఫూర్తి ప్రదాతలు పుస్తకం పాఠకులలో ఉద్యమ స్ఫూర్తిని నింపుతుంది, పూర్వపు ఉద్యమకారుల ఉద్యమ ఆదర్శాలు నేటి తరానికి దారి దీపం లాంటివని తొలి పలుకుల్లోనే షరీఫ్ గారిని ప్రశంసించారు. ఉభయ గోదావరి జిల్లాల ఉద్యమ కారులను స్మరిస్తూ షరీఫ్ తన జిల్లాల వారి సేవలు మననం చేసుకున్నారు.

జమాఆత్ గత దశాబ్దం వరకు అందరికి సుపరిచితులుగా నిలిచి, 89 ఏళ్ల వయసులో ఇహలోకం వదిలి పరలోకం పయనమైన మౌలానా అబ్దుల్ అజీజ్(ర.అ) జీవిత ఘట్టాలు, ఆంధ్ర ప్రాంతంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని స్పర్శించారు. భవిష్యత్ పరిణామాలు ఊహించే దార్శనికులు మౌలానా ముహమ్మద్ అబ్దుర్రజ్జాఖ్ లతీఫి (రహ్మా) సేవలు, ఆయన ఉద్యమ పటిమ, రిలీఫ్ వర్కు పరిచయం చేసారు. 47 ఏండ్ల చిన్న వయసులోనే దైవ సన్నిధికి చేరుకున్న ఆయన అపార సేవలు విప్లవాత్మకమైనవిగా రాష్ట్ర జమాత్ చరిత్రలో నిలిచి పోయాయి. మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖాలిఖ్ లతీఫీ, మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖుద్దూస్ లతీఫి సేవలు, ప్రభుత్వ ఉద్యోగాలు త్యజించడం, జైలు జీవితాలు చదువరులలో స్ఫూర్తి నింపుతాయి. డాక్టర్ అబ్దుల్ బాసిత్ అన్వర్ గారి సుధీర్ఘ అంకిత సేవ, ఉద్యమాలు, యం.పి.జే.స్థాపన, విజయవాడ మహాభలు బాసిత్ గారిని అందరి హృదయాలలో స్థిర పరుస్తాయి. ముహమ్మద్ ఖాజా అరిఫుద్దిన్ ఉద్యమ పథం, ప్రసంగాలు చరిత్రలో శాశ్వతంగా నిలుస్తాయి.

పుస్తకంలోని ప్రతి పేజీకి విలువ నింపుతూ అమ్జదలి ఖాద్రి, అబ్దుస్సలాం దస్తగీర్, అహమ్మద్ మొహియుద్దీన్, అబాబిల్ సాహితీ సంస్థ ద్వారా ప్రథమ మౌలానా మౌదూది పురస్కార గ్రహిత అబ్దుల్ సత్తార్ మణి, ఎస్.ఏ.అమీర్, మురబ్బీ అబ్దుర్రహ్మాన్ ఇలా ఇంచుమించు 25 మంది సమాచారం ఉద్యమ స్ఫూర్తి ప్రదాత పుస్తకంలో మనకు లభిస్తాయి. పుస్తకంలో ఫోటోలు కూడా ఉంటే పుస్తకానికి మరెంతో వన్నె వచ్చేది. **పుస్తకం ధర 180/- గా చూపినా రచయిత తగ్గింపు ధరతో ఇస్తున్నారు. ప్రతి స్థానిక బాధ్యులు ఈ పుస్తకం తప్పక తెప్పించుకోవడం మంచిది.**

**రచయిత ముహమ్మద్ షరీఫ్, 9948315826**



# జీవన మార్గాన్ని చూపే ధర్మం

షేక్ హసన్ సాహెబ్

**ఒక్కోసారి** మనలో కొందరికి అనిపిస్తుంటుంది... 'ఏమిటీ జీవితం, ఎందుకిలా బతుకుతున్నా'నని.' సుఖసంపదలలో తులతూగే వాళ్లకు ఇలా అనిపించకపోవచ్చునేమో కానీ కష్టాలు, కన్నీళ్లు, బాధలు అనుభవిస్తున్న వారికి మాత్రం ఇలా అనిపిస్తుం టుంది. అయితే జీవితం జీవించడానికే అన్నది సత్యం. జీవితంలో అన్నీ మన చేతిలో ఉండకపోవచ్చు. దానిని మనం విధికి వదిలేయాల్సిందే. కానీ మనం ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని గమనించాలి. ఎవరైనా సరే జీవిత పరమార్థం తెలుసుకుంటే వారి నిర్ణయాలు, ప్రవర్తన, లక్ష్యాలు, జీవితం పయనించే దిశ, మతం, ఇహపరలోకాల సార్థకతకు సంబంధించిన విషయాల్లో మెరుగైన మార్గాన్నే అనుసరించగలరు.

జీవిత లక్ష్యం ఏమిటి? మనందరినీ దేవుడు ఎందుకు సృష్టి ంచాడు? ఎందుకంటే ఆరాధించడానికి, విధేయత చూపడానికి, మన సృష్టికర్త ఒక్కడినే సేవించడానికి. మన జీవితాన్ని దేవుడు చూపిన మార్గంలో గడపడమే మన జీవిత పరమార్థం. దేవుని ఆదేశాల ప్రకారం నడుచుకుంటూ, దేవుని ప్రసన్నత పొందడానికి ప్రయత్నిస్తూ పరలోక సాఫల్యం పొందడమే జీవిత లక్ష్యంగా ఇస్లామ్ బోధనలు సూచిస్తున్నాయి. దేవుడు మనందరినీ సృష్టించాడు కాబట్టి మన తల్లిదండ్రుల వలే విధేయతను కోరే హక్కు ఆయనకూ ఉంది. భూమి, ఆకాశం, ఎత్తయిన పర్వతాలు, నీరు, సముద్రాలు, అందమైన ప్రకృతి, ఫలపుష్పాలు ఇత్యాదు లన్నీ అల్లాహ్ మనకోసమే సృష్టించాడు. ఈ విశ్వవ్యవస్థ యావత్తు దేవుని విధేయతకు కట్టుబడి పనిచేస్తుంది. సృష్టిలో ప్రతి వస్తువుతో ఏదో ఒక ప్రయోజనం ఉంది. మనిషిని కూడా దేవుడు మట్టి నుండి సృష్టించాడు. అంతేకాక అతడిని పరీక్షించేందుకు భూమి పైకి పంపాడు. మనిషికి దేవుడు తెలివి, చైతన్యం, స్వేచ్ఛను ఇచ్చాడు. ఈ విశ్వం ఒకరోజు అంతమై అందరూ సమీకరించబడ తారని ఖుర్ఆన్ తెలిపింది. ఆ రోజును ప్రళయ దినం అంటారు. ఎవరైతే అల్లాహ్‌ను, ఆయన దూతలను, ప్రళయ దినాన్ని నమ్ముతూ మంచి పనులు చేస్తారో వారంతా స్వర్గంలోకి ప్రవేశిస్తారని కూడా ఖుర్ఆన్ పేర్కొంటుంది.

జీవితం అల్లాహ్ ప్రసాదించిన వరం. సృష్టిలో మనకు కనిపించే మూగ జీవులు, పశుపక్షాదులు, కంటికి కనిపించని సూక్ష్మజీవులు, జిన్నుల కంటే కూడా ఉన్నతంగా అల్లాహ్ మనకు ఈ మానవ జన్మను ప్రసాదించాడు. మనకు ప్రసాదించిన ఈ జీవితాన్ని తిరిగి తీసుకునే శక్తి కూడా అల్లాహ్‌కే ఉంది. ఎవరు ఒకరి ప్రాణాలు తీసుకుంటారో వారు పాపం చేసినవారవుతారు. ఇస్లాంలో ఆత్మహత్య అన్నది మహా పాతకం. అందుకే ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని బాధలు వచ్చినా తట్టుకోవాలే తప్ప ఆత్మహ్యాతకు పాల్పడకూడదు. ఎలాంటి పరిస్థితులలోనైనా జీవించాలి. మనకు పూర్వం మహనీయులు, ప్రవక్తలు ఎలా జీవించాలన్నది ఆదర్శంగా చూపారు. అల్లాహ్ అగ్ని నుండి జిన్నులను, మట్టి ద్వారా మనిషిని సృష్టించాడు. మనిషి కేవలం సంపదను, పేరుప్రఖ్యాతులను పొందడానికే ఉనికిలోకి తేబడలేదు. కేవలం విందు వినోదాల్లో తేలియాడేందుకు జీవితం ప్రసాదించబడలేదు.

మరణానంతరం పరలోక జీవితం ఉందని ఖుర్‌ఆన్ హెచ్చరిస్తుంది. ఎవరు ఎప్పుడు చనిపోవాలన్నది అల్లాహ్ నే నిర్ణయిస్తాడు. మనిషి చనిపోయాక మూడు ప్రశ్నలు ప్రశ్నించబడతాయి. 1) ఎవరు నీ దేవుడు, 2) ఏది నీ ధర్మం (దీన్), 3) నీ ప్రవక్త ఎవరు? అనేవి. ఎవరైతే ఈ ప్రాపంచిక జీవితాన్ని అల్లాహ్ మెప్పు పొందడానికి వెచ్చిస్తారో వారు మరణానంతరం పరలోక జీవితంలో శాశ్వత సుఖాలు అనుభవిస్తారు. స్వర్గసీమకు వారసులవుతారు అని శుభవార్త అందిస్తోంది ఖుర్‌ఆన్. ఎవరైతే ఈ ప్రాపంచిక జీవితాన్ని మనోవాంఛలకు బానిసై ఇష్టారాజ్యంగా గడుపుతారో అలాంటి వారు శాశ్వతమైన నరకాగ్నికి ఆహుతి అవ్వాల్సి ఉంటుందని ఖుర్‌ఆన్ హెచ్చరించింది. మనిషి సన్మార్గంలో తన జీవితం గడపాల్సి ఉంటుంది. మంచి మార్గంలో నడిచి స్వర్గాన్ని సాధించడమో, లేదా చెడు మార్గంలో నడిచి నరకానికి పోవడమో నిర్ణయించుకునే స్వేచ్ఛను మనిషికి దేవుడు ఇచ్చాడు.

ప్రతి మనిషి ఎలా జీవించాలన్నది ఇస్లాం చక్కగా బోధించింది. పవిత్రంగా జీవించాలని నొక్కి చెప్పింది. వడ్డీ మహా పాపం అంది. ఇతరుల సంపద అమానత్ అన్నది. చిన్నారుల, బలహీనుల, మహిళల హక్కులు, ఆస్తిపాస్తులు అన్యాయంగా లాక్కో కూడదంది.

ఖుర్‌ఆన్ ఇచ్చిన తొలి ఆదేశం...'చదువు' అనే. అందుకనే అందరూ చదవాలి. నేర్చుకోవాలి. ఈ సృష్టిలో ఉన్న విషయాలను అన్వేషించి సత్యాన్ని తెలుసుకోవాలి. జీవితంలో అజ్ఞాన తిమిరాన్ని అధిగమించాలి. శాస్త్రసాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందాలి.

నీతి నిజాయితీలతో జీవితం గడపాలన్నది ఇస్లామ్ స్ఫూర్తి. ఇస్లాం ధర్మం నిషేధించిన వాటిని హరామ్ అంటాము. ముస్లింలు హరామ్ పనులు చేయకుండా, హలాల్(అనుమతించిన) పనులు చేయాల్సి ఉంటుంది. సక్రమమైన జీవితం, సన్మార్గ జీవితం గడపాలనుకునే వారికి చెడు వ్యసనాలు ఉండకూడదు. వ్యసనాలు మొదట ప్రలోభానికి గురిచేసి చివరికి పతనానికి కారణమవుతుంటాయి. అలాగే మనిషికి చెడుగుణాలు కూడా ఉండకూడదు. అంటే మదం(గర్వం), అత్యాశ, కామం, ఈర్ష్య, తిండిపోతుతనం, క్రోధం, బద్ధకం వంటివి ఉండకూడదు. అర్థవంతమైన జీవితాన్ని అన్వేషించాలి. పురుషులకు, మహిళలకు సమాన హక్కులు కల్పించిన నిష్పాక్షిక ధర్మం ఇస్లాం. దైవభీతితో అందరినీ సన్మార్గంలో బతికేలా చేస్తుంది.

చివరగా మనం అర్థం చేసుకోవాల్సింది ఒక్కటే. దైవాదేశానుసారం సన్మార్గంలో జీవించి, తీర్పు దినాన దేవుడికి జవాబు చెప్పుకునేలా బతకాలి. అందరూ సుఖసంతోషాలతో, సమానత్వంతో, న్యాయ బద్ధంగా, హక్కులతో, చీకూచింతా లేకుండా జీవించేందుకు, అందరి సంక్షేమాన్ని చూసేది ఇస్లాం ధర్మం మాత్రమే. ఆధునిక ప్రపంచంలో ఇప్పుడు బాగా తిష్టవేసుకు కూర్చున్నది భౌతిక వాదమే. దీని దుష్ప్రభావాలు... వ్యాపార సంస్కృతి, అవినీతి, అరాచకం, పేదవారు మరింత పేదవారు కావడం, ధనవంతులు మరింత ధనవంతులు కావడం, విద్య,సామాజిక, రాజకీయ అసమానతలు వగైరాలు. అందరికీ జీవిత పరమార్థాన్ని తెలిపేది, ఎంతో చిన్నదైన జీవితంలో ఎలా జీవించాలో నేర్పించే అసలైన ధర్మం ఇస్లాం. కానీ ఆధునిక కాల పరిస్థితులు మారినా, జీవన స్థితిగతులు మారినా అందరికీ మంచి జీవన మార్గాన్ని చూపేది ఇస్లాం ధర్మమేనని చెప్పక తప్పదు.



తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది    ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

మక్కా అవతరణ

22–25 మరి నేను నా ప్రభువూ, మీ ప్రభువూ అయినవాని రక్షణ పొందాను, మీరు నా పైన దాడి జరపకుండా ఉండేందుకు. మీరు నా మాటను నమ్మకపోతే సరే, నాపై చెయ్యి చేసుకోవడం విరమించు కోండి."[19] కడకు అతను తన ప్రభువుకు మొరపెట్టుకున్నాడు, వీరు అపరాధులు అని.[20] (సమాధానం ఇవ్వబడింది) అలాగయితే, రాత్రికి రాత్రే నా దాసుల్ని తీసుకుని[21] బయలుదేరు. మిమ్మల్ని వెంటాడటం జరుగుతుంది.[22]సముద్రాన్ని తెరచిపెట్టిన స్థితిలోనే వదలిపెట్టు. ఈ సేన మొత్తం మునిగిపోనున్నది."[23] ఎన్నో తోటలు, సెలయేళ్ళు, పొలాలు, వైభవోపేతమయిన భవంతులు, వారు వదలిపెట్టి వెళ్ళిపోయారు.

19. హజ్రత్ మూసా అందజేసిన సమస్త సూచనలకు ప్రతిగా ఫిర్ఔన్ తన మంకుతనం పట్ల మొండిగా వ్యవహరించినప్పటి సమాచారమిది. కాని ఆ రోజుల్లో ఈజిప్ట్ సామాన్య ప్రజలు, ప్రముఖులు, అనుదినం ఆ సూచనలకు ప్రభావితులయి పోవడం చూసి అతను బిత్తరపోయేవాడు, ఆందోళన చెందేవాడు. ఆ కాలంలో అతను తొలుత నిండు సభలో ప్రసంగించాడు. దాన్ని జుఖ్‌రుఫ్ సూరా 51–53వ ఆయత్‌లలో ఉటంకించడం జరిగింది. (చూడండి ఖుర్‌ఆన్ అవగాహనం : సం.7, అజ్ జుఖ్‌రుఫ్ పాదసూచికలు 45–49). తరువాత పరిస్థితులు తన అదుపు తప్పి, చేజారిపోవడం చూసి చివరికి దైవ సందేశహరుణ్ణి సంహరించాలని సమాయత్తమయ్యాడు. అప్పుడు ఆ మహనీయుడు మూ'మిన్ సూరా 27వ ఆయత్‌లో వచ్చిన మాటను పలికారు: "నేనయితే లెక్క అడిగే దినాన్ని నమ్మని ప్రతి దురహంకారికి ఎదురుగా నా ప్రభువూ మీ ప్రభువూ అయినవాని శరణు పొందాను." ఇక్కడేమో మహనీయ మూసా (అ) తాను పలికిన ఆ మాటనే ప్రస్తావించి ఫిర్ఔన్‌కు, అతని పరిపాలనా అధికారులకు చెబుతున్నారు, చూడండి, మీరు చేస్తున్న దాడులన్నింటికీ ప్రతిగా సకలలోకాల ప్రభువయిన అల్లాహ్ శరణు కోరాను. ఇక మీరు నాకు ఏమాత్రం హాని కలిగించలేరు. కాని స్వయంగా మీరు మీ మేలును కాంక్షించే వారయితే నా జోలికి రావడం మానుకోండి. నా మాట నమ్మకపోతే మానేయండి, నాపైన చెయ్యి వెయ్యడానికి మటుకు ఒడిగట్టకండి. లేకపోతే దానికి అతి ఘోరమయిన పర్యవసానం చూడవలసి వస్తుంది.

20. ఇది మహనీయ మూసా తన ప్రభువు సమక్షంలో సమర్పించుకున్న చివరి నివేదన: "వీరు అపరాధులు." అంటే వీరు అపరాధులవడం ఇప్పుడు ఖండితంగా రుజువయిపోయింది. వీరికి రాయితీ ఇవ్వడానికయినా, వీరికి సంస్కరణార్థం మరింత అవకాశం కల్పించడానికయినా ఇక ఆస్కారం మిగులలేదు. ఇక ఏలినవారు అంతిమ నిర్ణయం విధించే సమయం ఆసన్నమయి పోయింది.

21. అంటే, విశ్వసించిన జనులందరినీ అన్నమాట. వీరిలో బనీ ఇస్రాయీల్, హజ్రత్ యూసుఫ్ కాలం నుండి హజ్రత్ మూసా రాక వరకు ముస్లిములలో చేరిపోయిన కిబ్తీయులయిన ఈజిప్ట్ పౌరులు కూడా ఉన్నారు. వీరితో పాటు హజ్రత్ మూసా (అ) సూచనలు చూసి, ఆయన సందేశ ప్రచారానికి ప్రభావితులయి ఇస్లామ్ స్వీకరించిన ఈజిప్ట్ ప్రజలూ ఉన్నారు. (వివరాలకు చూడండి, ఖుర్‌ఆన్ అవగాహనం, సం.3, యూసుఫ్ : పాదసూచి 68).

22. హజ్రత్ మూసా (అ) కు హిజ్రత్ చేసేం (వలసపోయే)దుకు ఇచ్చిన ప్రారంభ ఆదేశం (వివరాలకు చూడండి ఖుర్‌ఆన్ అవగాహనం, సం.4, తాహా:పాదసూచి 53 సం.5, అష్ షు'అరా:ఆయత్:52, పాద సూచికలు 41 – 47).

23. మహనీయ మూసా (అ) తన బృందాన్ని తీసుకుని సముద్రం దాటి తీరంపైన దిగిపోయిన తరువాత, సముద్రంపై చేతి కర్రతో కొట్టి, అది చీలిపోయే ముందు ఉన్నట్టే చేయాలని, తద్వారా ఫిర్ఔన్, అతని సైన్యం అప్పుడు మహత్త్యం వల్ల ఏర్పడిన దారి గుండా రాకుండా అడ్డుకోవాలని అనుకున్నారు. అప్పుడు ఈ ఆదేశం ఇవ్వబడింది. అలా చేయబాకు, దీన్ని ఇలాగే చీలి ఉన్నట్టే చీలి ఉండని, అప్పుడే ఫిర్ఔన్ తన సైన్యంతో సహా ఈ దారిలోకి దిగి వస్తాడు, ఆ తరువాత సముద్రాన్ని యథాతథంగా వదలివేయడం జరుగుతుంది. అప్పుడు ఈ మొత్తం సైన్యాన్ని ముంచివేయడం జరుగుతుంది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## ఖైబర్ యుద్ధం

**115)** అబూ మూసా అష్అరీ(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) హిజ్రత్ చేశారన్న సమాచారం మాకు అందినప్పుడు, మేము యమన్‌లో ఉన్నాము. అందువల్ల మేము దైవప్రవక్త(స)ను కలుసుకునే సంకల్పంతో వలస పోయాము– నేనూ నా సోదరులిద్దరు. వారిద్దరికన్నా నేను చిన్నవాణ్ని. నా సోదరు లలో ఒకరి పేరు అబూ బుర్దా, మరొకరి పేరు అబూ రుహ్మ్. ఆయన ఇంకా ఇలా అన్నారు: మేము యాభై మందికి పైచిలుకే లేదా యాభై మూడు మందిమి లేదా యాభై రెండు మందిమి ఉన్నాం. మేము ఓడలో ప్రయాణమయ్యాము. కాని మా ఓడ మమ్మల్ని నజాషీ రాజ్యానికి తీసుకెళ్ళింది. అక్కడ మేము జాఫర్ బిన్ అబీ తాలిబ్(రజి)ను కలుసుకున్నాము. ఆయన మాకన్నా ముందే మక్కా నుండి అబిసీనియా దేశానికి వలస పోయారు. మేము ఆయనతోపాటే అక్కడ ఉండసాగాము. తరువాత మేమంతా కలసి మదీనాకు బయలుదేరాము. మేము అక్కడ దైవప్రవక్త(స)ను కలుసుకునే నాటికే ఆయన(స) ఖైబర్‌ను జయించారు.

కొంతమంది మాతో, అంటే ఓడపై ప్రయాణమై వచ్చిన వారితో 'మేము మీకన్నా ముందే హిజ్రత్ చేశాము' అని అన్నారు. మాతోపాటే ఓడలో ప్రయాణం చేసి వచ్చిన అస్మా బిన్తె ఉమైస్ (జాఫర్ భార్య) ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ హఫ్సా(ర.అ) దగ్గరకు వచ్చింది. ఆమె కూడా సహాబాతో కలసి నజాషీ రాజ్యానికి వలస పోయింది. అంతలో హజ్రత్ ఉమర్(రజి) కూడా హఫ్సా(ర.అ) ఇంటికి వచ్చారు. ఆ సమయంలో అస్మా బిన్తె ఉమైస్(ర.అ) అక్కడే ఉన్నారు.

ఉమర్(రజి) ఆమెను చూడగానే 'ఎవరీమె?' అని అడిగారు. 'ఈమె అస్మా బిన్తె ఉమైస్(ర.అ)' అని హఫ్సా చెప్పారు. 'ఓహో! అబిసీనియా దేశం నుండి ఓడలో ప్రయాణం చేసి వచ్చినది ఈమెగారే కదూ!' అన్నారు ఉమర్. 'అవునండి' అన్నారు అస్మా. అప్పుడు ఉమర్ ఆమెతో, 'హిజ్రత్ చేసే విషయంలో మేము మీకన్నా ముందంజలో ఉన్నాము. అందువల్ల మీకన్నా మేము దైవప్రవక్త(స)కు సన్నిహితు లము' అని చెప్పారు. ఈ మాట విని అస్మా బిన్తె ఉమైస్(ర.అ)కు చాలా కోపం వచ్చింది. ఆమె ఇలా అన్నారు : 'ఎంతమాత్రం కాదు. దైవసాక్షిగా! మీరంతా దైవ ప్రవక్త(స)కు తోడుగా ఉన్నారు. మీలో ఆకలిగొన్నవారికి దైవప్రవక్త(స) అన్నం తినిపించేవారు. తెలియనివారికి జ్ఞానబోధ చేసేవారు. కాని మేము బహుదూరాన, అబిసీనియాలో శత్రువుల దేశంలో నివసించేవారం. ఈ బాధలన్నీ మేము దైవం మరియు దైవప్రవక్త మార్గంలోనే భరించాము. దైవసాక్షిగా చెబుతున్నాను. మీరు చెప్పిన మాటను నేను దైవప్రవక్త(స)కు వినిపించేవరకూ అన్నం తినను. పచ్చి మంచి నీళ్ళు కూడా ముట్టను. అక్కడ మమ్మల్ని (కొందరు) బాధించేవారు, హెచ్చరించేవారు. బెదిరించేవారు.

ఇదంతా నేను దైవప్రవక్త(స)కు చెబుతాను. దీని గురించి ప్రశ్నిస్తాను. అల్లాహ్ సాక్షిగా! నేను అబద్ధం చెప్పను. విషయాన్ని వక్రీకరించను. జరిగిన దానిపై హెచ్చుతగ్గులు కూడా చేయను'.

అంతలోనే దైవప్రవక్త(స) అక్కడికి ఏతెంచారు. అప్పుడామె, 'దైవప్రవక్తా! ఉమర్ నాతో ఈ విధంగా చెప్పార'ని ఫిర్యాదు చేసారు. "మరి నీవు దానికి సమాధానంగా ఏమన్నావు?" అని ఆయన(స) అడిగారు. 'నేను ఆయన గారికి ఈ విధంగా సమాధానమిచ్చాను' అని ఆమె వివరించారు. అంతా విన్న మీదట దైవప్రవక్త (సఅసమ్): "ఆయన మాకు నీకన్నా ఎక్కువ సన్నిహితుడేమీ కారు. ఆయనకూ, ఆయన తోటివారికి కేవలం ఒక హిజ్రత్ మాత్రమే ప్రాప్తమయింది. అయితే ఓడలో ప్రయాణం చేసిన మీరు రెండు హిజ్రత్‌ల భాగ్యం దక్కించుకున్నారు" అని ఓదార్చారు.

అస్మా బిన్తె ఉమైస్(రజి) ఇలా అనేవారు : ఈ సంఘటన తర్వాత అబూ మూసా(రజి)తోపాటు ఓడవారంతా నా దగ్గరకు తండోపతండాలుగా వచ్చి ఈ హదీసు గురించి నన్ను అడిగేవారు. వారి దృష్టిలో తమ గురించి దైవప్రవక్త(స) పలికిన పలుకు కన్నా సంతోషకరమైనది, గర్వించదగినది వారి కొరకు మరొకటి లేదు. అబూ మూసా(రజి) ఈ హదీసును నా ద్వారా పదేపదే వినేవారని అస్మా బిన్తె ఉమైస్(ర.అ) చెప్పినట్లుగా అబూ బుర్దా తెలిపారు.

అబూ బుర్దా (రజి) గారు అబూ మూసా అష్అరీ (రజి) ద్వారా ఉటంకించిన దాని ప్రకారం ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా పలికారు : "అష్అరీ వర్గీయులు రాత్రిపూట మదీనాలో తమ నివాస గృహాలకు వచ్చి ఖుర్ఆన్ పారాయణం చేసినప్పుడు, వారి కంఠస్వరం ఆధారంగా నేను వారిని గుర్తు పడతాను. పగటిపూట నేను వారి నివాస గృహాలను చూడకపోయినప్పటికీ (ఖుర్ఆన్ పారాయణం ఆధారంగా వారిని గుర్తు పడతాను. ఈ అష్అరీ వర్గీయులలో వివేకవంతుడైన ఒక పురుషుడు ఉన్నాడు. అతనికి అవిశ్వాసుల వాహనదారులు లేక శత్రువులు ఎదురుపడినప్పుడు, 'ఇప్పటివరకూ నా స్నేహితులంతా మీ కోసమే ఎదురు చూశారు. కాస్త ఆగండి, లేదా కొంచెం గడువు ఇవ్వండి (వాళ్ళు మీ సంగతి చూసుకుంటారు)' అని అంటాడు."[1]

115-1. హదీసు చివర్లో అష్అరీ వర్గీయుల్లోని 'హకీమ్' (విజ్ఞుని) ప్రస్తావన వచ్చింది. 'హకీమ్' అనేది అతని పేరో లేక అతనిలోని విజ్ఞత వివేచనల కారణంగా అతనిని అలా వ్యవహరించేవారో తెలీదు. అయితే ఆ వ్యక్తి ధైర్యశాలి. సమయోచితంగా స్పందించేవాడు. అసాధారణమైన తన తెలివిడితో ప్రత్యర్థులను బోల్తా కొట్టించేవాడు. తనకు ప్రాణాపాయం ఉందని పసిగట్టగానే తాను ఒంటరిగా లేనని, తన వెంట చాలా మంది ఉన్నారని చెప్పి శత్రువు బారి నుండి ఆత్మరక్షణ చేసుకునేవాడు.

★★★

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

‘చరితార్ధులు’-2



# పీర్ ముహమ్మద్ అన్సారి మోన్నిస్

## (1882-1949)




67



**9440241727**

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త**

**సయ్యిద్ నశీర్ అహమ్మద్**

**రూపొందించిన ఆల్బమ్**

**‘చరితార్ధులు’ - 2 (తెలుగు)**

**THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి**

**గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**

బీహార్ రాష్ట్రంలోని చంపారన్ నీలిమందు తోటల రైతులను రాచి రంపాన పెడుతున్న ఆంగ్లేయ ప్లాంటర్ల అకృత్యాలను ఎంతో ధైర్యంగా తన రచనల ద్వారా బహిర్గతం చేసి మహాత్మాగాంధీని నేరుగా తన ఇంటికి రప్పించుకున్న పాత్రికేయుడు పీర్ ముహమ్మద్ అన్సారి మోన్నిస్ బీహార్ రాష్ట్రం చంపారన్ ప్రాంతంలోని బేతియా నగర్‌లో 1882లో జన్మించారు. ఆంగ్లేయ ప్లాంటర్లు స్థానిక రైతులను ఇక్కట్లకు గురిచేస్తూ సాగిస్తున్న దోపిడి-దుష్కృత్యాలను స్వయంగా చూసిన ఆయన 1905 నుండి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా కలం చేతబూనారు. 1907లో మొదటిసారిగా ‘కర్మయోగి’ పత్రికలో ఆరంభమైన ఆయన రచనా వ్యాసంగం చివరి వరకు సాగింది. బ్రిటిష్ ప్లాంటర్ల చర్యలకు వ్యతిరేకంగా రైతాంగాన్ని ఏకం చేస్తూ ఉద్యమించిన రైతు నాయకుడు షేక్ గులాబ్‌కు అండగా నిలిచారు. గణేష్ శంకర్ విద్యార్థి పత్రిక ‘ప్రతాప్’, డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ ‘దేశ్’ లాంటి పత్రికలలో రైతుల కడగండ్లు గురించి రాయడం ద్వారా ఆంగ్ల ప్లాంటర్ల దుర్మార్గాలను వెల్లడి చేశారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రైతులను సంఘటితం చేస్తూ, రైతాంగ ఉద్యమాలకు తన కలంతో బలం చేకూర్చుతున్న ఆయనను ‘ప్రమాదకర వ్యక్తి’గా ఆంగ్ల ప్రభుత్వం ప్రకటించింది. 1915లో ఉపాధ్యాయ ఉద్యోగం నుండి బర్తరఫ్ చేసింది. చంపారన్ రైతుల కడగండ్ల మీద ఆయన రాసిన వ్యాసాల పరంపర చివరకు మహాత్మాగాంధీ, భారత జాతీయ కాంగ్రెస్ దృష్టికి వెళ్లింది. ఈ మేరకు మిత్రుడు రవికుమార్ శుక్లాకు ఆయన రాసిచ్చిన లేఖ 1916 నాటి భారత జాతీయ కాంగ్రెస్ లక్నో సమావేశాల్లో మహాత్మా గాంధీజీకి చేరింది. ఈ విషయం మీద విచారణ జరపాల్సిందిగా గాంధీజీని భారత జాతీయ కాంగ్రెస్ కోరింది. 1917 ఏప్రిల్ 23న చంపారన్ వచ్చిన మహాత్ముడు స్వయంగా పీర్ మూనిస్ గృహానికి వెళ్ళారు. 1918లో ‘రైతుసభ’ స్థాపించినందుకు ఆగ్రహించిన ప్రభుత్వం ఆయనను నాలుగు మాసాలు నిర్బంధించింది. రైతాంగ ఉద్యమకారుడిగా, జాతీయోద్యమ యోధుడిగా, మరోవైపున సాహిత్య వేత్తగా, కలం యోధునిగా బహళ పాత్రలు పోషించిన పీర్ ముహమ్మద్ 1919లో ఏర్పడిన ‘బీహార్ సాహిత్య సమ్మేళనం’ స్థాపకులలో ఒకరయ్యారు, 1921లో చంపారన్‌లో భారత జాతీయ కాంగ్రెస్ శాఖ ఏర్పాటులో భాగస్వాములయ్యారు. 1930లో ఉప్పుసత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన మూడు మాసాలు జైలుశిక్షకు గురయ్యారు. 1932లో భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థిగా చంపారన్ జిల్లా బోర్డు సభ్యునిగా, బేతియా ప్రాంతీయ బోర్డు ఛైర్మన్‌గా ఎన్నికైన ఆయన 1937లో ఆ పదవులను వదులుకుని చెరుకు రైతుల పక్షాన నిలిచారు. ఆంగ్లేయులకు, ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలచిన నిఖార్సయిన పాత్రికేయుడు పీర్ ముహమ్మద్ అన్సారి మోన్నిస్ 1949 ఆగస్టు 14న కన్నుమూశారు. ✤




# హక్కుల హననం మానవతకు వ్యతిరేకం

మదీహా అర్జుమంద్

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు గడిచి పొయ్యాయి. అయినా నేటికీ ప్రజలు న్యాయం కోసం, హక్కుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. కోట్లాదిమంది ప్రజలు ఇంకా దారిద్ర్య రేఖకు దిగువనే జీవనం గడుపుతున్నారు. వీరికి హక్కులు, న్యాయం అందించాల్సిన బాధ్యత ఎవరిది.? ప్రపంచంలో బలవంతులు, బలహీనులు అని రెండురకాల వారున్నారు. గతంలోనూ ఉన్నారు. వర్తమానంలోనూ ఉన్నారు. భవిష్యత్తులోనూ ఉంటారు. సహజంగా మానవ నైజం కోరేదేమిటంటే, బలవంతుడైనవాడు తన శక్తిసామర్ధ్యాలను దుర్వినియోగం చేయకూడదు. బలహీనుల పట్ల ప్రేమ, దయ, జాలి, సానుభూతి, సహకార వైఖరిని అవలంబించాలి. బలవంతుడి శక్తి, బలహీనుడి అశక్తతను దూరం చేసి, అతడి బలోపేతానికి, ఎదుగుదలకు దోహద పడాలి. కాని ఎక్కువ సందర్భాల్లో ఇలా జరగడంలేదు. బలవంతుల చేతిలోనే అనేక హక్కులు, అధికారాలు ఉండిపోతున్నాయి. బలహీనుడికి వాటిలో కొంతకూడా ప్రాప్తం కావడంలేదు. అడుగడుగునా అన్యాయం, అభద్రత, హక్కుల ఉల్లంఘనే అతనికి ఎదురవుతున్నాయి. తద్వారా హక్కులు అనుభవిస్తున్నవారు, హక్కుల నిరాకరణకు గురైనవారు వేర్వేరు వర్గాలుగా ఏర్పడ్డారు. ఒకవైపు సమస్త వనరులపై అధికారం కలిగిన బలవంతుల వర్గం, మరోవైపు దేనిపైనా ఏ అధికారమూ లేని బలహీనుల వర్గం. ప్రపంచ చరిత్రలో ఇలాంటి అసమానతా దృశ్యాలు అనేకం గోచరిస్తాయి. నిజానికి భూప్రపంచంపై నివసించే ప్రతి మానవుడికీ సహజంగానే కొన్ని హక్కులున్నాయి. మనిషి మనిషిగా జీవించడానికి ఇవి అత్యంత అవసరం. ఇందులో జాతి, కులం, మతం, భాష, ప్రాంతీయతలకు అతీతంగా మనిషిగా జీవించే హక్కు కలిగి ఉండడమే ప్రధాన ఉద్దేశ్యం. అలాంటి మానవ హక్కుల దినాన్ని 1948 డిసెంబర్10న ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. అప్పటినుండి ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 10 వ తేదీని అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఏవిధమైనటువంటి వివక్షత లేని మానవ సమాజ నిర్మాణమే ఈ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ లక్ష్యం. అంటే 1948 కంటే ముందు మానవహక్కుల భావన లేదని అర్థంకాదు. అది ఐక్యరాజ్యసమితి అధికారిక ప్రకటన మాత్రమే. మానవహక్కుల్లో అన్నిటికన్నా అత్యంత ప్రాధాన్యత కలిగిన మౌలిక హక్కు జీవించేహక్కు. దీన్ని కాదనే హక్కుఅధికారం ఎవ్వరికీ లేదు. దీనిపైన్నే ఇతర హక్కులన్నీ ఆధారపడి ఉంటాయి. ఒకవేళ ఈ హక్కునే గనక భంగపరిచినట్లయితే, ఇక మరే హక్కులూ మిగలవు. భూప్రపంచంలోని సమస్త ప్రజాస్వామిక చట్టాలు దీన్ని ఒక సహజ సిద్ధమైన, ప్రకృతి సిద్ధమైన ప్రాథమిక హక్కుగా గుర్తించాయి. న్యాయశాస్త్రం, చట్టాల ప్రకారం ఏ ఒక్కరినీ ఈ హక్కుకు దూరం చేయడం సాధ్యం కాదు. మానవుడు తాను నివసించే సమాజంలో చలన రహితంగా జీవితం గడపాలని అనుకోడు. క్రియాశీలంగా, ప్రభావవంతంగా తన పాత్రను పోషించాలని కోరుకుంటాడు. ఇది అతని సహజమైన హక్కు.

సమాజం ప్రగతి పథంలో పయనించాలంటే ఇది అవసరం. ప్రతి వ్యక్తి తన శక్తి సామర్థ్యాలకనుగుణంగా కృషి చేసే స్వేచ్ఛాయుత అవకాశాలున్నప్పుడే ఇదిసాధ్యం. నేటి ప్రజాస్వామ్య యుగంలో భావ ప్రకటనా స్వేచ్ఛను మానవుడి ప్రాథమిక హక్కుల్లో ఒకటిగా గుర్తించడం జరిగింది. ప్రతి వ్యక్తికీ తనభావాలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు, అధికారం ఉంటుంది. అభిప్రాయాలను ప్రకటించడానికి ఎంత స్వేచ్ఛా, అధికారాలున్నాయో, తిరస్కరించడానికి కూడా అంతే హక్కు ఉంటుంది. అయితే ఈ భావ ప్రకటనా స్వేచ్ఛను హద్దులు మీరి వినియోగిస్తే సమాజానికి హానికరం. మానవుడు తన వైయక్తిక జీవితంలో స్వేచ్ఛ, హక్కు కలిగి ఉండాలన్నది అంగీకృత విషయమే. అందులో బయటి వ్యక్తుల జోక్యం ఏవిధంగానూ ఉండకూడదన్నదీ సర్వసమ్మతమే. ఇది అతని హక్కు. ఇందులో జోక్యం చేసుకునే అధికారం ఎవరికీ ఉండదు. ఈ విధంగా సమాజంలో మానవుడికి అనేక హక్కులు ప్రాప్తమై ఉన్నాయి. సాధారణంగా ప్రపంచంలో మానవ హక్కుల భావన మాగ్నాకార్టాతో ప్రారంభమైందని చెబుతారు. కాని వేయిన్నర సంవత్సరాల నాడే నాటి ఆటవిక సమాజంలో మానవ హక్కుల్ని నిర్వచించి, మానవులందరికీ హక్కులు ప్రసాదించారు ముహమ్మద్ ప్రవక్త. జాతి, వర్ణం, లింగం, కులం, మతం, భాష, ప్రాంతం, రాజకీయం... లేదా ఇతర కారణాలతో ఏవిధమైన వివక్షకు గురికాకుండా ఉండే హక్కు, భావ ప్రకటనా సేచ్ఛ హక్కు ఈ చిత్రహింసలు, క్రూరత్వం నుండి రక్షణ పొందే హక్కు, వెట్టిచాకిరీ, బానిసత్వం లాంటి దుర్మార్గాల నుండి రక్షణ పొందే హక్కు, సరైన కారణం, రుజువులు, సాక్ష్యాలు లేకుండా నిర్బంధించబడకుండా ఉండే హక్కు, నేరస్తులని అనుమానమున్నప్పటికీ, నిందితులని తేలే వరకు వారు నిరపరాధులే, కేవలం అనుమానం కారణంగా దోషులుగా, నేరస్తులుగా నిర్ధారించే అధికారం ఎవ్వరికీలేదు. ఇది వారి హక్కు. ఒక అభియోగం ఆపాదించబడినప్పుడు, పక్షపాత రహితంగా విచారణ పొందే హక్కు, స్వేచ్ఛగా స్వదేశంలో గాని, విదేశాల్లో గాని పర్యటించే హక్కు, సురక్షిత ప్రాంతంలో ఏకాంతంగా జీవించే హక్కు, ఇవికాక, జీవించే హక్కు, సామాజిక భద్రతా హక్కు, భావ స్వాతంత్ర్య హక్కు, విద్యాహక్కు, పిల్లలు ఆడుకొనే హక్కు, బంధుత్వ హక్కు. ప్రజాస్వామ్య హక్కు, ఇలాంటి అనేక రకాల హక్కులు మానవులకు ఉన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పుడు యావద్దేశ ప్రజలూ స్వతంత్ర భారతావనిలో తమ భవిష్యత్తు మహోజ్వలంగా ఉండగలదనీ, సకల జనులకూ ఈ సమస్త హక్కులు లభ్యం కాగలవనీ ఆశించారు. భారత రాజ్యాంగ నిర్మాణ సభ సభ్యులు కూడా ప్రజలు కలలు గన్న ఈ సుందర స్వప్నాన్ని సాకారం చెయ్యడానికి డా. బాబా సాహెబ్ అంబేద్కర్ సారథ్యంలో భారత రాజ్యాంగానికి రూపకల్పన చేశారు. భారత దేశాన్ని ఒక సంక్షేమ రాజ్యంగా తీర్చిదిద్దాలని రాజ్యాంగ ప్రదాతలు దీక్షబూనారు. ఈ బృహత్ సంకల్పంతోనే వారు భారత రాజ్యాంగ్యాన్ని ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగంగా మలిచారు. రాజ్యాంగం ఇంత పెద్ద ఉద్గ్రంథం కావడానికి ముఖ్య కారణం, ఇందులో దేశం, దేశ ప్రజల సంక్షేమానికి సంబంధించిన ఒక్కొక్క అంగాన్ని, శాఖను గురించి విపులంగా చర్చించడమే. ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా అతి ముఖ్యమైన, ప్రధానాంగాలు మూడుంటాయి. అవి : శాసన వ్యవస్థ, పాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థ. ఈ మూడు అంగాలూ సమన్వయంతో పని చేస్తేనే ఏ దేశమైనా సంక్షేమ రాజ్యంగా ఆవిర్భవిస్తుంది. ఈ మూడు వ్యవస్థలు తమ హక్కులు, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి నప్పుడే ప్రజల హక్కులు పరిరక్షించబడతాయి. కాని దురదృష్టం ఏమిటంటే, మన దేశంలో ఈ మూడు వ్యవస్థలే ప్రజలకు ఏమాత్రం జవాబుదారీగా వ్యవహరించడంలేదు. అందుకే మానవ సమాజంలో వివక్ష, అణచివేత, అసమానత, హక్కుల ఉల్లంఘన కనబడుతున్నాయి, కొనసాగుతున్నాయి. కంచే చేను మేసిన చందంగా వ్యవస్థే పక్కదారి పడితే ఇక రక్షణ ఎక్కడ ఉంటుంది? చాలా దేశాల్లో మానవ హక్కులకు పూర్తి భరోసా లేని పరిస్థితులు నేటికీ కనిపిస్తున్నాయి. మణిపూర్‌లో, ఫలస్తీనాలో ఏం జరిగిందో, ఏం జరుగుతోందో మనం చూస్తున్నాం. రాచరిక , నియంతృత్వ పాలనలు అంతరించి, ప్రజాస్వామ్యాన్ని పూలమాలగా స్వీకరించిన భారత్‌లో సైతం మానవ హక్కుల హననం నిరంతరాయంగా కొనసాగుతోంది. యూపీ సహా అనేక రాష్ట్రాల్లో మనమీ దుర్మార్గాలను చూస్తున్నాం. యుద్ధాలతో విలవిల్లాడుతున్న దేశాల్లో, రాచరిక పాలన కొనసాగుతున్న దేశాల్లో మానవ హక్కులకు భద్రత లేదంటే ఒక అర్థముంది. కాని, ప్రజాస్వామిక దేశాల్లో కూడా మానవ హక్కుల హననం కొనసాగడం కంటే దారుణం ఇంకేముంటుంది? అతిపెద్ద ప్రజాస్వామిక దేశమని గొప్పలు చెప్పుకొంటున్న భారత్‌లో కొనసాగుతున్న మానవ హక్కుల హననంపై ఐక్యరాజ్య సమితి లాంటి అంతర్జాతీయ సంస్థలు అక్షింతలు వేసినా మన పాలకుల్లో చలనం రాకపోవడం విడ్డూరం, విషాదం. కాని భారత ప్రజలు చేయగలిగింది, తమకు అన్యాయం జరుగుతోందని, తమ హక్కులు ఉల్లంఘించబడుతున్నాయని భావించినప్పుడు, వాటికి సంబంధించిన ప్రత్యేక కోర్టులను, కమిషన్‌లను ఆశ్రయించవచ్చు. కాని ఇది అన్ని వేళలా, అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. ఏది ఏమైనా మానవుల్లో నైతిక స్పృహ జాగృతమైననాడు హక్కుల ఉల్లంఘన గురించి భయపడాల్సిన అవసరం ఉండదు. కోర్టులు, చట్టాలు తాత్కాలిక ఉపశమనమే తప్ప శాశ్వత పరిష్కారాలు కావు. పాలకుల్లో పరివర్తన, ప్రజల్లో చైతన్యం వచ్చి, నైతిక విలువలు పరిఢవిల్లిన నాడే హక్కులు పరిరక్షించబడతాయి.




**- యండి. ఉస్మాన్ ఖాన్**

**భారత దేశ** స్వాతంత్ర్యం కోసం అనేక మంది యువ కిశోరాలు తమ ప్రాణాలను పణంగా పెట్టారు. వారిలో రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌లు ముఖ్యులు. వయసుకు మించిన పరిణితితో కేవలం ముప్ఫయ్యేళ్ళకే నూరేళ్ళ ఖ్యాతినార్జించి, దేశం కోసం ఉరితాడును ముద్దాడిన దేశ భక్తులు. ఆంగ్లేయులకు సింహ స్వప్నాలై ముచ్చెమటలు పట్టించిన రాంప్రసాద్ , అష్ఫాఖుల్లాలలో .. బిస్మిల్ 1897 జూన్ 11వ తేదీన, అష్ఫాఖ్ 1900 అక్టోబర్ 22న ఉత్తర ప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో జన్మించారు. మూల్ మతి, మురళీధర్‌లు బిస్మిల్ తల్లిదండ్రులు. మజ్హారున్నీసా, షఫీఖుల్లాహ్ ఖాన్ అష్ఫాఖ్ తల్లిదండ్రులు. రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖ్‌ల కుటుంబ నేపథ్యాలు ఉత్తర దక్షిణ ధృవాల్లాంటివి. రాంప్రసాద్ బిస్మిల్ సనాతన హిందువు, ఆర్యసమాజ సభ్యుడు. అష్ఫాఖ్ సాంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన స్వఛ్ఛమైన ముస్లిం. భిన్న సామాజిక జీవన నేపథ్యాల నుండి వచ్చిన వీరి స్నేహం పాలూ పంచదారలా కలగలిసిపోయింది.

అష్ఫాఖ్ ముస్లిం కావడంతో ఆర్య సమాజ సభ్యుడైన బిస్మిల్ మొదట్లో అతన్ని ఒక పట్టాన నమ్మలేదు, శంకించాడు. కాని అచంచలమైన అష్ఫాఖ్ దేశ భక్తికి, అంకిత భావానికి బిస్మిల్ చలించిపోయాడు. అష్ఫాఖ్‌ను అనుమానించినందుకు తీవ్రంగా పశ్చాత్తాప పడ్డాడు. చివరికి ఇద్దరి లక్ష్యం ఒకటే కావడంతో సనాతన హిందువైన రాంప్రసాద్ బిస్మిల్‌కు, సాంప్రదాయ ముస్లిం ఐన అష్ఫాఖ్‌కు గాఢమైన స్నేహబంధం ఏర్పడింది. ఒకే కంచంలో తినేవారు. ఒకే మంచంపై పడుకునేవారు. ఒకరికొకరు ప్రాణ సమానమై పొయ్యారు. ఎవరి ధర్మాలను వారు పాటిస్తూనే దేశం కోసం ఒక్కటై భావి తరాలకు ఆదర్శంగా నిలిచి పొయ్యారు. ఇద్దరు యువకులూ భావుకులే. యుక్త వయసులోనే పదునైన కవిత్వం రాశారు. సామ్రాజ్య వాద భావజాలాన్ని తుత్తునియలు చేశారు. అచంచలమైన దేశభక్తితో బ్రిటీషోడి గుండెల్లో నిప్పు కణికలై రగిలారు. పర్వతంలా పాతుకు పోయిన ఆంగ్లాధికారాన్ని తొడగొట్టి ఢీకొట్టారు. ఆర్థిక ఇబ్బందులు లేని కుటుంబాల్లో, చీకూ చింతా లేకుండా విలాసవంతంగా గడప వలసిన యవ్వన కాలంలో దేశం గురించి ఆలోచించడం మామూలు విషయం కాదు. కాని వారు ఆ వయసులోనే దేశం కోసం ఆలోచించారు. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని కుటుంబ నేపథ్యాలైనా, వారి ఆలోచనలు రాజకీయంగానే సాగేవి. దీంతో ఎప్పుడెప్పుడు విప్లవోద్యమంలోకి దూకాలని ఉవ్విళ్ళూరేవారు. విదేశీ వస్తువుల వాడకం ఆంగ్లేయుల బానిసత్వానికి చిహ్నమని,

వీటి వాడకం మానేయాలని ప్రచారమే ప్రారంభించారు. మాతృదేశంకోసం పోరాడి చరిత్రలో నిలిచి పోవాలని, దానికోసం తాము ఏమైపోయినా పరవా లేదని దృఢంగా నిర్ణయించుకున్నారు. ఇక ఉద్యమ అవసరాల కోసం కావలసిన ధనాన్ని ప్రభుత్వ ధనం కొల్లగొట్టడం ద్వారా సమకూర్చుకోవాలని నిర్ణయించారు. అందులో భాగంగా 1925 ఆగస్టు 9 వ తేదిన అష్ఫాఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి మరికొందరు విప్లవ కారులు కలిసి కాకోరీ గ్రామం వద్ద ప్రభుత్వ ఖజానాతో వెళుతున్న రైలును దోపిడీ చేశారు. పట్టుమని పదిమంది కూడా లేని యువకులు ఏకంగా బ్రిటిష్ ఖజానాకే గురి పెట్టి, రైలునే దోచేయడం ఆంగ్లాధికారులకు తల తీసేసినంత పనైతే, ఉద్యమ కారులకు కొత్త ఉత్సాహాన్ని అందించినట్ల యింది. దీంతో ఆంగ్లాధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని సోదాలు ముమ్మరం చేసి, సెప్టెంబరు 26న రాంప్రసాద్ బిస్మిల్‌ను అరెస్టుచేశారు. అష్ఫాఖ్ ఇంటిపై కూడా పోలీసులు దాడి చేశారు. కాని అష్ఫాఖ్ వారికి దొరక్కుండా తప్పించుకున్నాడు. కొన్నాళ్ళ పాటు బనారస్‌లో అజ్ఞాతంలో గడిపి ఢిల్లీ చేరుకున్నాడు. ఢిల్లీలో మిత్రుడు చేసిన నమ్మక ద్రోహంతో పోలీసులకు పట్టుబడ్డాడు. నయానా భయానా లొంగదీసుకొని మిగతా వారి సమాచారం రాబట్టాలని పోలీసులు ఎంత ప్రయత్నించినా అష్ఫాఖ్ ఏమాత్రం భయపడలేదు. చివరికి 1927 డిసెంబర్ 19 వ తేదీన అష్ఫాఖ్‌ను, రాంప్రసాద్ బిస్మిల్‌ను ఉరి తీయాలని తీర్పు వెలువడింది. ప్రాణత్యాగానికి ఏనాడో సిద్ధపడ్డ ఈ ఇద్దరు ప్రాణ మిత్రులు మాతృ దేశ విముక్తి కోసం ఉరి కంబాన్నెక్కబోతున్నందుకు గర్వపడుతున్నామని సగర్వంగా ప్రకటించారు. ఇంతటి అదృష్టం అందరికీ దక్కదని, ఏడుకోట్ల (ఆనాటి) ముస్లిం జనాభాలో దేశంకోసం బలిపీఠమెక్కబోతున్న తొలి ముస్లింను తానే అయినందుకు సంతోషంతో పొంగిపోతున్నాని అష్ఫాఖ్ గర్వంగా ప్రకటించాడు. ఉరితాడును పూలమాలగా స్వీకరించి, 'నా మాతృదేశమా.. సదా నీసేవ చేస్తూనే ఉంటా.. ఉరి శిక్షయినా, యావజ్జీవమైనా.. సంకెళ్ళ దరువుతో నీ కీర్తిగానం చేస్తూనే ఉంటా.' అని కవితాత్మకంగా తన దేశభక్తిని చాటుకున్నాడు. 'కుఛ్ ఆర్జూ నహీ.., హయ్ తొ బస్ ఇత్‌ని.., రఖ్ దె కోయీ ఖాకె వతన్ మేరె కఫన్ మే..' అంటూ దేశం పట్ల, తను పుట్టిన భూమి పట్ల తన అచంచలమైన ప్రేమాభిమానాలను వ్యక్తం చేశాడు. ఆ రోజు రానే వచ్చింది. ప్రాతఃకాల ప్రకృతి ఈ తంతంగాన్నంతా చేష్టలుడిగి చూస్తూ ఉండి పోయింది. అమరజీవులు అష్ఫాఖుల్లా, రాంప్రసాద్ బిస్మిల్‌ల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పొయ్యాయి. ఇద్దరినీ వేర్వేరు జైళ్ళలో ఒకేరోజు, ఒకే సమయాన ఉరి తీశారు. భూ ప్రపంచం ఉన్నంత వరకు దేశం పట్ల బాధ్యతను గుర్తుచేస్తూ అష్ఫాఖ్, బిస్మిల్‌ల త్యాగం, స్నేహం సజీవంగా ఉంటుంది. హిందూ ముస్లిం ఐక్యతను చాటుతూ.. మతోన్మాదులకు సవాలు విసురుతూ సామరస్య గీతం ఆలాపిస్తూనే ఉంటుంది.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# ఆధ్యాత్మిక జీవితంతో మానసిక ఆరోగ్యం



పర్వీన్ సుల్తానా

**ఇస్లాం** సమతుల్యమైన, ఆరోగ్యకరమైన మానసిక స్థితికి ప్రాధాన్యతనిస్తుంది. తన బోధనల ద్వారా, ఇస్లాం మానసిక ఆరోగ్యానికి ఒక ఫ్రేమ్ వర్క్‌ను అందిస్తుంది. ఇస్లామిక్ మార్గదర్శక సూత్రాలను పాటించడం ద్వారా, వ్యక్తులు మానసిక ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడానికి కావలసిన ఓదార్పు పొందవచ్చు.

ఇస్లాం దైవంతో అనుబంధం ద్వారా ప్రయోజనం, భావోద్వేగ నెరవేర్పును అందిస్తుంది. ఆధ్యాత్మికత మెరుగైన మానసిక ఆరోగ్యంతోముడిపడి ఉన్నది. ఆధ్యాత్మికత మానసిక అనారోగ్యాన్ని నివారించ డంలో, చికిత్స చేయడంలో ముఖ్యమైన అంశంగా గుర్తించబడుతుంది..

ఇస్లాంలో, మానవుడిని శరీరం, మనస్సు, ఆత్మ మిశ్రమంగా చూస్తారు. ఈ సంపూర్ణ దృక్పథం భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్య పరస్పర అనుసంధానాన్ని గుర్తిస్తుంది. మంచి మనస్సు అల్లాహ్ నుండి వచ్చిన ఆశీర్వాదంగా పరిగణించబడుతుంది, దానిని పెంపొందించడానికి, సంరక్షించడానికి ముస్లింలు ప్రోత్సహించబడ్డారు.

ఇస్లాంలో మానసిక ఆరోగ్యానికి ఆధ్యాత్మికత మూలస్తంభం. ప్రార్థన (సలాహ్), ఖురాన్ పఠనం, జిక్ర్ వంటి ఆరాధనలు అంతర్గత శాంతిని తెస్తాయని ముస్లిములు నమ్ముతారు.

ఆధ్యాత్మిక అభ్యాసాలు ఒత్తిడి, ఆందోళన, నిరాశ భావాలను తగ్గించ గలవు.

ఇస్లామిక్ బోధనలు సహనం (సబర్), కృతజ్ఞత (షుక్ర్) భావోద్వేగ స్థితిస్థాపకత కోసం శక్తివంతమైన సాధనాలుగా నొక్కిచెబుతున్నాయి. జీవితంలో ఎదురయ్యే పరీక్షలను సహనంతో సహించడం ఒకరి విశ్వాసాన్ని, వ్యక్తిత్వాన్ని బలపరుస్తుంది.

ప్రవక్త ముహమ్మద్ ఇలా అన్నారు: “విశ్వాసి వ్యవహారం విచిత్రం. ఎందుకంటే ప్రతి విషయంలో అతనికి మేలు ఉంటుంది. సంతోషంగా ఉంటే, అతను అల్లాకు కృతజ్ఞతలు తెలుపుతాడు. అతనికి హాని జరిగితే, అతను సహనం వహిస్తాడు. అది అతనికి మేలు” (సహీహ్ ముస్లిం).

ఇస్లాం సమాజం సామాజిక సంబంధాలకు గొప్ప ప్రాముఖ్యతనిస్తుంది. బలమైన కుటుంబ బంధాలు, సామూహిక ప్రార్థనలు, సామూహిక మద్దతు ముస్లిం జీవితంలో అంతర్భాగం.

ఒంటరితనం తరచుగా మానసిక ఆరోగ్య సవాళ్లతో ముడిపడి ఉంటుంది. సామాజిక పరస్పర చర్య, దాతృత్వం, ఇతరులకు సహాయం చేయడం వంటి వాటి ద్వారా మానసిక ఆరోగ్య సమస్యలు పరిష్కరించబడతాయి.

మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వృత్తిపరమైన సహాయం కోరడం ఇస్లాంలో అనుమతించబడడమే కాకుండా ప్రోత్సహించ బడుతుంది.

ముహమ్మద్ ప్రవక్త ఇలా సలహా ఇచ్చారు: “వైద్య చికిత్సను ఉపయోగించుకోండి, ఎందుకంటే అల్లాహ్ దానికి మందు లేకుండా వ్యాధిని సృష్టించలేదు” (సహీహ్ అల్-బుఖారీ).

మానసిక ఆరోగ్య సమస్యలు చాలా కష్టాలు కలిగిస్తాయి. అయితే, ఇస్లాం కరుణ, అవగాహనను ప్రోత్సహిస్తుంది.

ప్రవక్త ముహమ్మద్ (స) ఆపదలో ఉన్నవారి పట్ల సానుభూతిని ప్రదర్శించారు. ఒకరికొకరు మద్దతు ఇవ్వడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

ప్రార్థన (దుఆ) ద్వారా అల్లాహ్ వైపు తిరగడం, అతనిపై నమ్మకం ఉంచడం (తవక్కుల్) మానసిక ఆరోగ్య పోరాటాలను ఎదుర్కోవడంలో ముఖ్యమైన అంశాలు. చికిత్స పొందుతున్నప్పుడు, ముస్లింలు వైద్యం కోసం ప్రార్థించమని, అల్లాహ్ జ్ఞానంపై ఆధార పడాలని ప్రోత్సహిస్తారు, ఇబ్బందులు దైవిక ప్రణాళికలో భాగమని తెలుసుకుంటారు.

ఇస్లాంలో మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవటానికి క్రింది వ్యూహాలు సూచించబడ్డాయి

రోజువారీ ప్రార్థనలు, ఆరాధనలు- మానసిక స్థిరత్వానికి దోహదం చేస్తాయి.

దివ్య ఖురాన్, హదీసులు చదవడం, ప్రకృతిలో అల్లాహ్ సంకేతాలు, జీవితంలోని ఆశీర్వాదాలను ప్రతిబింబించడం ప్రతికూల ఆలోచనలను ఎదుర్కోవటానికి సహాయపడతాయి.

అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పడం, సవాళ్ల నుండి ఆశీర్వాదాల వైపు దృష్టిని మారుస్తుంది. సానుకూలతను పెంపొందిస్తుంది.




# దివ్యాంగులు రెండింతల ప్రతిఫలానికి అర్హులు

- అస్రా

**కొందరు** ఈ లోకంలో పుట్టు గుడ్డిగా పుడతారు. మరికొందరు రెండు కాళ్లులేని కుంటి వాళ్లుగా, రెండు చేతులు లేని అవిటి వారుగా జీవితాన్ని నెట్టుకొస్తుంటారు. అవయవాలు సక్రమంగా లేని అంగవికరుల జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో మనందరం చూస్తూనే ఉంటాము. బధిరులు తమ భావాలను వ్యక్తం చేయడానికి ఎంత ప్రయాసపడతారో. అంధులు తమ పనులు తాము చేసుకోవ డానికి పడే ప్రయాస వర్ణించలేము. రెండు కాళ్లులేని కుంటివారు, చేతులు లేని అవిటి వారి, మాట్లాడలేని మూగవారి వెతలూ మనం సమాజంలో చూస్తుంటాము.

జీవితం ఎవరికీ వడ్డించిన విస్తరికాదు. మరెవ్వరికీ పూలపరుపు అంతకన్నా కాదు. జీవితంలో అందరికీ అన్నీ సక్రమంగా దొరకవు. కొందరు పుట్టుకతోనే ఐశ్వర్యవంతులయితే కొందరు కటిక పేదరికంలోనే కళ్లు తెరుస్తారు. కొందరు అన్ని అవయవాలతో అంగసౌష్టవంతో ఉంటే కొందరు పుట్టు గుడ్డివారిగానో, అంగ వికలురుగానో పుడతారు. ఈ ప్రపంచంలో పుట్టే ప్రతీ ప్రాణీ పరీక్షను ఎదుర్కొంటున్నాడు. అష్టఐశ్వర్యాలైనా, కటిక పేదరికమైనా, అంగ సౌష్టవమైనా, ఆరోగ్యమైనా, రోగమైనా అంతా దేవుడు పెట్టే పరీక్షే. దేవుడు పెట్టే పరీక్షలో సహనంతో నెగ్గితే అల్లాహ్ రెండింతల పుణ్యఫలం ప్రసాదిస్తాడని ముహమ్మద్ ప్రవక్త (సఅస) సెలవిచ్చారు.

ముహమ్మద్ ప్రవక్త (స) కాలంలో ఒక స్త్రీకి మూర్ఛ వచ్చేది. ఆమెకు ఆ రోగం వచ్చినప్పుడు తన బట్టల –స్పృహ కూడా ఉండేది కాదు. ఆమె ప్రవక్త మహనీయుల (స) వద్దకు వచ్చి తనకు స్వస్థత ప్రసాదించమని దైవాన్ని వేడుకోమని అభ్యర్థించింది. "నీవు కోరితే నేను అల్లాహ్ ను వేడుకుంటాను. లేదా నీవు సహనం వహించగోరితే అదీ మంచిదే. అల్లాహ్ దానికి బదులుగా నీకు స్వర్గప్రాప్తిని కల్పిస్తాడు." అని చెప్పారు. దానికి ఆవిడ ఇలా బదులిచ్చింది. 'అలా అయితే నేను సహనమే వహిస్తాను కాని రోగం వచ్చినప్పుడు నా ఆచ్ఛాదన తప్పిపోకుండా ప్రార్థన చేయండి.' అని ఆయన (స) తదనుగుణంగా అల్లాహ్‌ను వేడుకున్నారు. మనకు పుట్టుకతో వచ్చిన లోపం పట్ల చింతిస్తూ కూర్చోకుండా, నిరాశ చెందకుండా సహనం వహిస్తే దానికి రెట్టింపు ప్రతిఫలం ప్రసాదిస్తాడన్న విషయం ఈ గాథ ద్వారా మనకు తెలుస్తుంది. సహన గుణం మనిషిలో సాహసం, ధీమాను నూరిపోస్తుంది. ధైర్యం కోల్పోయి కూర్చుండిపోకుండా, పరిస్థితుల్ని ఎదుర్కొని పోరాడేలా తీర్చిదిద్దుతుంది. దైవం ప్రసాదించిన బలాలను బలోపేతం చేసుకుని బలహీనతలను అధిగమించాలన్నదే ప్రవక్త బోధనల సారాంశం. ఇస్లామ్ భావన ప్రకారం వికలాంగి తాను వికలాంగి అయినప్పటికీ ధార్మిక సేవ కానీ, దైవారాధన కానీ సేవచేసినట్లయితే అతని పుణ్యఫలం దైవం సమక్షంలో రెట్టింపు అవుతుంది. ఒక వికలాంగి అడ్డంకులున్నప్పటికీ, తనలోని లోపాలను లెక్కచేయకుండా చేసే కృషికి దైవం దగ్గర రెండింతల ప్రతిఫలం లభిస్తుంది. అల్లాహ్ దృష్టిలో గౌరవ స్థానం, గౌరవ ప్రమాణాలు, బాహ్య రూపురేఖలు, ఆరోగ్యం, అంగసౌష్ఠవం, ధనసంపదలు కావని, ధర్మనిష్ఠ, పరిశుద్ధ మనస్సు, శీల స్వభావాలని ఇస్లాం బోధనల సారాంశం. మంచి మనస్సు లేని అందమయిన కళ్లు గలవాడికన్నా సత్యవంతుడయిన, మంచి మనస్సున్న రెండు కళ్లులేని అంధుడే ఉత్తముడు. బలహీనుల స్థానం దైవం దృష్టిలో అత్యంత ఉన్నతమైనది. అవయవాల లోపం ఉన్నప్పటికీ వివేకంతో మెలిగేవాడే నిజమైన బుద్ధిమంతుడు.. అంగవైకల్యం ఉన్నప్పటికీ ఉన్నతమైన ఆలోచనలు, ఆశయాల్ని దరిచేర్చుకున్నవారే గొప్పవారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నప్పటికీ కురచబుద్ధితో ఆలోచించేవారే నిజమైన అంగవికలురు.




సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**గత సంచిక తరువాయి**

## అసూయ

అన్ని దుర్గుణాలకు మూలం అసూయ. అసూయ అంటే తోటి వ్యక్తి ఆనందంగా, సుఖంగా ఉండటాన్ని చూసి ఓర్వలేకపోవడమే.

ఈ అసూయే ప్రవక్త యూసుఫ్(అ)కి, ఆయన తండ్రి ప్రవక్త యాకూబ్(అ)కి మధ్య ఎడబాటుకి మూలకారణమైంది. ఆ తర్వాత కక్షలు, కాఠిన్యాలు, కలహాలు జరగడానికి దారితీసింది. అసూయ అనే దుర్గుణం అత్యంత ప్రమాదకరమైంది. మర్రి చెట్టు కూడా క్షణాల్లో మాడిపోయేటట్లు చేయగల శక్తి మెరుపు కణానికి ఉన్నట్లే, మహా మహా వృక్షాలు సయితం రోజుల్లోనే ఎండిపోయే టట్లు చేయగల శక్తి వేరుపురుగుకు ఉన్నట్లే, అసూయ అనే జ్వాలాగ్ని ఒక మనిషిలో ప్రవేశిస్తే, అది ఆ మనిషిని దహించి, సర్వనాశనం చేసేస్తుంది. అందుకే అందరూ అసూయ విషయంలో జాగ్రత్త వహించాలి.

అబ్బా...! పక్కింటామెకు ఎన్ని నగలున్నాయో, ఇంటి నిండా ఎంత ఫర్నీచరుందో! మాకే ఏమీలేదు... ఆ రమ్య చూడు ఎంత అందంగా ఉందో... నేనూ ఉన్నాను ఎందుకు...! ఇలాంటి వాటినే అసూయ అంటారు. అవతలివారి వద్ద ఉన్న గుణం లేదా వాస్తవం తమలో లేదన్న భావన వల్ల అసూయ మనసులో జనిస్తుంది. ఈ కారణంగానే అవతలి వారిని చూసి అసూయపడటం జరుగు తుంటుంది.

ఒక వ్యక్తి ఒక ముసలమ్మను "అమ్మా, మీ ఇంట్లో దొంగలు పడ్డారు కదా. అన్నీ దోచుకెళ్ళారు కదా. అయినా నువ్వు ఎలా సంతోషంగా ఉన్నావు?" అని అడిగాడట. దానికా ముసలమ్మ "మా ఇంట్లో వస్తువులకంటే మా పక్కింట్లో వారి వస్తువులు ఎక్కువ మొత్తంలో దొంగలించబడ్డాయి. అందుకు నాకు చాలా సంతోషంగా ఉంది" అని బదులిచ్చిందట.

చిటికెడు విషం ఎలాగైతే కడివెడు పాలను విషతుల్యం చేస్తుందో, అలాగే అసూయ అనేది మనిషిలోకి ప్రవేశిస్తే అతని సకల సద్గుణాలను సంహరించేస్తుంది. అందుకే అసూయ, ద్వేషం, క్రోధం అనే దుర్గుణాలకు దూరంగా ఉండాలి. వాటిని అంటరానివిగా, తాకరానివిగా, ముట్టరానివిగా భావించి బహిష్కరించాలి. అప్పుడే ప్రతి మనిషి పురోగమించగలడు.

## అసూయ ఆదేశం

మానవుల మధ్య శత్రుత్వం పెంపొందించే పగ, వైరం, ద్వేషం, ఈర్ష్య, అసూయ, ఓర్వలేనితనం మొదలైన చెడు(దుష్ట) గుణాలు ఇస్లాంలో అనుమతింపబడలేదు.

అనస్ ఇబ్నె మాలిక్ (ర) ఇలా ఉల్లేఖించారు- ప్రవక్త(స) ఇలా

హితోపదేశం చేశారు 1. మీరు ద్వేషించుకోవద్దు 2. మీరు అసూయ (ఈర్ష్య) పడవద్దు 3. మీరు ఒకరికొకరు వీపు చూపుకోవద్దు (దూరం కావద్దు), అల్లాహ్ దాసులై సహోదరులుగా ఉండండి. తోటి సోదరులతో మూడు రోజులకంటే ఎక్కువగా (అయిష్టంతో) మాట్లాడకుండా ఉండడం ముస్లింలకు అనుమతింపబడలేదు" (బుఖారీ)

ఈ హదీస్ ద్వారా ముస్లింలు తమలో తాము ఏవిధంగా సోదర భావంతో ప్రేమ, సామరస్యం, సానుభూతి (ఇతరుల దుఃఖంలో పాలుపంచుకోవడం) వంటి మంచి గుణాలు కలిగి ఉండాలో ప్రవక్త(స) మనకు బోధించారు.

## అసూయ తెచ్చిన అనర్థం

చింతా జ్వరం, జ్వరం కంటే విలక్షణమైంది. జ్వరమైతే శరీరానికి సంబంధించింది. కాని చింతా జ్వరం మనస్సునకు సంబంధించింది. మనోవ్యాధికి మందు లేదని లోకంలో అంటారు. చింతా జ్వరం లంకణాలవల్ల నయమయ్యేది కాదు. చింతా జ్వరం బుద్ధిని నిద్రను ఉత్సాహాన్ని ఆకలిని ఆకారాన్ని తేజస్సును బలాన్ని క్రమక్రమంగా క్షీణింపజేస్తుంది.

ఈర్ష్య, అసూయ, క్రోధం వల్ల ఎలాంటి అనర్థాలు జరుగుతాయో వాటివల్ల ఎంతటి విఘాతాలు జరుగుతాయో విదితమవుతుంది. కావున ఈర్ష్య అసూయలకు దూరంగా ఉండాలని అందువలన, కలిగే ప్రయోజనాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలియ వస్తుంది. బలవంతంగా అవతల వారి నుంచి ఏదీ లాక్కోలేమనే విషయాన్ని గ్రహించాలి. ఈ గ్రహింపు మనిషికి చాలా అవసరం. భార్యభర్తలైనా సరే ఎవరి వ్యక్తిత్వం వారికి ఉంటుందని ముందుగా గుర్తించాలి. ప్రేమించే వాళ్లనుంచి ఇంకా రెట్టింపు ప్రేమను గౌరవాన్ని పొందగలగాలంటే మనం ఈర్ష్యను జయించాలి.

## పూర్వీకుల మాటల్లో అసూయ

ఇబ్ను సీరీన్ (రహ్మ) ఇలా అన్నారు: "ప్రాపంచిక విషయాలలో నేను ఎప్పుడూ ఎవరిపైనా అసూయ పడలేదు. ఒకవేళ అతను స్వర్గవాసి అయితే, అశాశ్వత తటాకం కోసం అసూయ చూపడటంలో అర్థం లేదు. ఎందుకంటే స్వర్గం శాశ్వత నివాసం. స్వర్గం ముందు ప్రపంచపు భోగభాగ్యాలన్నీ దిగదుడుపే. ఒకవేళ అతను నరకవాసి అయితే, అతనికి దక్కిన ఐహిక సుఖసౌఖ్యాలను చూసి నేను అసూయ చెందడం మూర్ఖత్వం అవుతుంది. ఎందుకంటే అతను నరక బాటన నడుస్తున్నాడు, నరకమే అతని నివాసమవుతుంది."

అబుల్ లైస్ సమర్ఖందీ (రహ్మ) ఇలా అన్నారు: అసూయకు మించిన అవలక్షణం మరొకటి లేదు. ఎందుకంటే, అసూయ పేరుని అసూయాగ్ని జ్వాలలు ఎదుటి వ్యక్తికి తాకక ముందే, అసూయపరుడు స్వతహాగా అయిదు యాతనల్ని అనుభవిస్తాడు. 1) అంతం కానీ ఆవేదన అతన్ని దహించి వేస్తుంది. 2) అతను పడే యాతనకు ఎలాంటి పుణ్యఫలం దక్కదు. 3) అతనిలోని ఈ అవలక్షణం మూలంగా జనం అతన్ని అసహ్యించుకుంటారు. 4) అల్లాహ్ కోపం అతని మీద విరుచుకుపడుతుంది. 5) అసూయాపరునికి సత్కార్యాలు చేసే సద్బుద్ధి కలగదు.

## రక్త సంబంధీకుల్లో అసూయ

తల్లిదండ్రులు తమ పిల్లలందరినీ ప్రేమిస్తారు. కాని కొందరి పట్ల ఎక్కువ మమకారం చూపుతారు. అందుక్కారణం ఆ పిల్లల మంచి గుణగణాలు. అయితే ఈ ప్రేమాభిమానాలు వ్యక్తం చేయడంలో జాగ్రత్తగా ఉండడం అవసరం. సంతానంలో కొందరి పట్ల ఎక్కువ ఇష్టాన్ని ప్రదర్శిస్తే మిగిలిన వారిలో అసహనం, అసూయలు జనించే అవకాశం ఉంది.

దివ్య ఖుర్ఆన్‌లో ఈ కథ చాలా వివరంగా, చాలా ఆసక్తి దాయకంగా చెప్పడం జరిగింది. ఇందులో హాస్యం, మానవ బలహీనతలు, ఉన్నత గుణగణాలు, ఈర్ష్యాసూయలు, విద్వేషం, మోసం, కుట్ర, క్రూరత్వం, సహనం, విశ్వాసం, ధైర్యం, సద్వర్తనం, సానుభూతి వంటి అనేక గుణగణాలు మన ముందుకు వస్తాయి.

యూసుఫ్ (అలైహిస్సలాం) పద్దెనిమిది సంవత్సరాల వయసులో ఉన్నారు. ఆయన దృఢమైన, అందమైన యువకునిగా ఎదిగారు. చాలా నమ్రత కలిగిన వారిగా పేరుపడ్డారు. దయ, సానుభూతులతో ప్రవర్తించేవారు. ఆయన సోదరుడు బిన్ యామిన్ కూడా అలాంటి గుణగణాలు కలిగినవాడే. వీరిద్దరూ ఒకే తల్లి కుమారులు. సుగుణ సంపన్నులైన ఈ ఇరువురు కుమారుల

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

పట్ల తండ్రి యాఖూబ్ (అలైహిస్సలాం) ఎక్కువ ఇష్టం ప్రదర్శించే వారు. వీరిద్దరిని తన దృష్టి నుంచి పక్కకు వెళ్ళనిచ్చే వారు కాదు. వారిని పరిరక్షించడానికిగాను ఇంటి తోటలోనే వారిని పనిచేసేలా నిర్దేశించారు.

అసూయ అగ్ని వంటిది. అది సోదరుల గుండెల్లో విద్వేషంగా మారింది. ఒక సోదరుడు మిగిలిన వారితో, "నాన్నగారు మనందరి కన్నా యూసుఫ్, బిన్ యామిన్ల పట్ల ఎక్కువ ప్రేమ చూపుతున్నారు. నిజానికి వారిద్దరి కన్నా మనం బలంగా ఉన్నాం. మన అమ్మలకన్నా వారిద్దరి అమ్మనే ఆయన ఎక్కువ ప్రేమిస్తారు. ఇది న్యాయం కాదు" అన్నాడు. వారందరూ తమకు అన్యాయం జరిగి పోతోందని భావించారు.

అసూయ వల్ల బాధలకు గురయిన వానికి దేవుని రక్షణ లభిస్తుంది. యూసుఫ్ (అలై) సోదరులు ఆయన్ను బానిసగా అమ్ముడు పోయేలా చేయడానికి పన్నిన కుట్ర నిజానికి ఆయన్ను జీవితంలో ఉన్నత స్థానానికి చేర్చింది.

## అసూయ రకాలు

ఇమామ్ ఘజాలీ (రహ్మ) అసూయను నాలుగు శ్రేణులుగా విభజించారు.

1) ఎలాంటి ప్రయత్నం చెయ్యకుండానే, తనకు లభించక పోయినా పర్వాలేదు గానీ, ఎదుటి వ్యక్తికి దక్కకూడదు అని కోరుకోవడం. ఇది అత్యంత నీచమైన అసూయ.

2) ఒకరికి లభించినటువంటిదే తనకు కూడా లభిస్తే మంచిది అనుకోవడం. ఉదాహరణకు- విలాసవంతమైన ఇల్లు, ఖరీదైన వాహనం, అందమైన ఇల్లాలు, సుగుణవంతులైన పిల్లలు, సమాజంలో మంచి హెూదా మొదలయినవి. ఒకవేళ దక్కకపోతే ఎదుటి వ్యక్తి కీడుని కాంక్షించకపోవడం.

3) ఒకరి మంచి స్థితి తనకు కూడా దక్కాలని రెక్కలు విరిగేలా పని చేసి చివరికి దక్కకపోయే సరికి అది ఎదుటి వ్యక్తి దగ్గర కూడా ఉండకూడదు అని కోరుకోవడం.

4) ఒకరిలాగా తానూ మంచి స్థితికి చేరుకోవాలని ఆశ పడటం. ఇది ప్రాపంచిక విషయాల్లోనయితే మినహాయించబడినది. పరలోక విషయంలోనయితే మెచ్చుకోదగినది.

## ధార్మిక విషయాల్లో అసూయ ఎంత వరకు సబబు?

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ఇద్దరు తప్ప ఇతర వ్యక్తుల పట్ల అసూయ చెందడం ధర్మసమ్మతం కాదు. ఒకరు, దేవుడు ఖుర్‌ఆన్ విద్య ప్రసాదించగా దాన్ని రేయింబవళ్ళు చదవడంలో, చదివించడంలో నిమగ్నుడయి ఉండే వ్యక్తి. రెండోవాడు, దేవుడు సిరిసంపదలు అనుగ్రహించగా వాటిని రేయింబవళ్ళు (సత్కార్యాలలో) వినియోగించే వ్యక్తి. "(ఇలాంటి వారి పట్ల అసూయ చెందడంలో తప్పు లేదు)". (సహీహ్ బుఖారీ)

## అసూయ వేరు పుణ్యకార్యాల్లో పోటీ వేరు

హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం : ముహాజిర్లలో పేద ప్రజలైన కొంతమంది ఓ రోజు దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చి, "(దైవప్రవక్తా!) ధనికులు (మాకన్నా) గొప్ప స్థానాలను, శాశ్వత సుఖాలను పొందుతారు" అని అన్నారు. "అదెలా?" అని అడిగారు దైవప్రవక్త (స). దానికి వారు సమాధానమిస్తూ, "వారూ మాలాగే నమాజులు చేస్తున్నారు. ఉపవాసాలు పాటిస్తున్నారు. అయితే వారు దానధర్మాలు కూడా చేస్తున్నారు. కాని (స్థోమత లేని కారణంగా) మేము (దానధర్మాలు) చేయటం లేదు. వారు బానిసల్ని కూడా విడిపిస్తున్నారు. మేము ఆ పని చేయలేక పోతున్నాం" అని అన్నారు.

అది విని దైవప్రవక్త (స), "అయితే నేను మీకో విషయం తెలియ జేయనా? దాన్ని గనక మీరు పాటిస్తే, మిమ్మల్ని మించిపోయిన వారి స్థాయికి మీరూ చేరుకుంటారు. మీ తరువాత వచ్చిన వారికంటే కూడా మీరు మించిపోతారు. మీ పద్ధతిని పాటించే వారు తప్ప మీకన్నా శ్రేష్ఠులు మరెవ్వరూ ఉండబోరు" అని అన్నారు.

"తప్పకుండా తెలియజేయండి దైవప్రవక్తా!" అని విన్నవించుకున్నారు సహచరులు. అప్పుడాయన "ప్రతి నమాజు తరువాత "సుబ్‌హానల్లాహ్", "అల్‌హందులిల్లాహ్", "అల్లాహు అక్బర్" అని (ప్రతి ఒక్కటి) ముప్ఫై మూడుమార్లు చొప్పున పఠించండి" అని అన్నారు. (పేద ప్రజలు దాన్ని ఆచరించటం మొదలుపెట్టారు. కొంతకాలానికి ధనికులకు కూడా ఆ విషయం తెలిసి పోయింది. వాళ్ళు కూడా దాన్ని పాటించసాగారు). అప్పుడు ముహాజిర్ నిరుపేదలు మళ్ళీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వెళ్ళి, "మేము చేస్తున్నది ధనిక సోదరులకు కూడా తెలిసి పోయింది. వాళ్ళూ మాలాగే దాన్ని ఆచరించటం మొదలు పెట్టారు" అని ఫిర్యాదు చేసుకున్నారు. దానికాయన "ఇది అల్లాహ్ అనుగ్రహం. అల్లాహ్ తాను కోరినవారికి తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు" అని అన్నారు. (బుఖారీ- ముస్లిం)

**(మిగతా వచ్చేవారం)**

# వేగుచుక్క

## (మహాత్మ జ్యోతిరావ్ పూలే వర్ధంతి నేపథ్యంలో...)

కె.లక్ష్మణ్ గౌడ్



సనాతన సాంస్కృతిక ఆది గురువులెవరైనా
తరతరాల ప్రబోధాల జ్ఞానసంద్రాలెన్నైనా
నిష్ఠాగరిష్ఠులైన నిత్య అగ్నిహోత్రులెందరైనా

మానవ ప్రగతి మూలాల రథచక్రాల క్రాంతులెవరివైనా
వివక్ష – విభజన చీలికలకు ఆద్యులెవరైనా
సమస్త జాతిని శాసించే సత్తువంతా పాక్షికత పాలైనా
గాడాంధకారంలో నిమ్న జాతులెంత వేదనకు బలైనా
బ్రతుకే ఒక శాపంగా పరిణమించిన దౌర్భాగ్య స్థితులెదురైనా
వేదవేదాంగాలు మానవ జీవితనిర్దేశక గ్రంథాలు ఎన్నివున్నా
మనషులంతా ఒక్కటే – అందరూ దైవ సృష్టి సంభూతులేనన్న
అవగాహనా రాహిత్యం
సమాజాన్ని చీల్చింది – సమరసభావన కనుమరుగైంది
మానవ సృష్టిలో లేని వైపరీత్యాల్ని
ఒక వర్గంపై మోపింది.

ఇదొక సంస్కారయుత మానవ సమాజమేనా?
ఆది మానవుల్లో లేని అరమరికలు
ఆధునికులకెందుకు?
వేయి వెలుగుల వేగుచుక్క పొడిచింది
వివక్ష తాండవంలో బ్రతుకుల్ని ఛిద్రం చేసిన
పరిణామ క్రమం వెనుదిరిగి చూసింది
ఆ వేగుచుక్క మందమతుల్ని
జ్ఞాన సంపన్నుల్ని చేసింది
ప్రగతి పురోగమనంలో పునాదిరాళ్లు పాతింది
రాజకీయ సిద్ధాంతాలన్నింటికీ ఒక జీవగ్రర్రయై వెలిగింది

భారతావని ప్రగతి పథంలో జ్యోతిరావు పూలే
నడి సంద్రంలో ఒక చుక్కాని
కటిక చీకటిలో ఒక క్రాంతిరేఖ
భావి భారత దిశానిర్దేశ పథంలో ఒక వేగుచుక్క
ఏ గొప్ప విప్లవాలు సాధించలేని మార్పు
ఒక మహాత్ముడి తపోదీక్షలో సాకారమైన మానవీయ పరిణామం.

❖




## ఈ శీతాకాలంలో చలి లేనట్టే..!

ఈ శీతాకాలంలో తీవ్రమైన చలి ఉండే అవకాశం లేదని భారత వాతావరణశాఖ అంచనా వేసింది. డిసెంబర్-ఫిబ్రవరి మధ్య దేశంలోని ఉత్తర-పశ్చిమ, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లోని చాలా ప్రాంతాల్లో కోల్డ్ వేవ్స్ వీచే రోజుల సంఖ్య తక్కువగా ఉంటాయని అంచనా. వాతావరణ శాఖ అంచనా మేరకు.. చాలా ప్రాంతాల్లో శీతాకాలంలో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నది. లా నినా పరిస్థితులు ఏర్పడకపోవడంతో ఈ ఏడాది శీతాకాలం సాధారణం కంటే వేడిగా ఉంటుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

## ప్రతి చోట తవ్వాలనుకునేవాళ్లు.. సోదరభావాన్ని కోల్పోతారు : అఖిలేశ్ యాదవ్ వార్నింగ్

పక్కా ప్లాన్ ప్రకారం సంభల్‌లో హింసకు పాల్పడినట్లు సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. మత సామరస్యాన్ని దెబ్బ తీసే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. లోక్‌సభలో జీరో అవర్‌లో సంభల్‌లో జరిగిన హింసపై మాట్లాడారు. మొఘల్ కాలం నాటి మసీదులో కోర్టు ఆదేశాల ప్రకారం సర్వే చేపట్టడాన్ని సమాజ్‌వాదీ పార్టీ వ్యతిరేకించింది. మసీదు సర్వే ద్వారా.. గంగా-జమునా తెహజీబ్‌ను దెబ్బతీస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఎక్కడపడితే అక్కడ తవ్వాలనుకునే వాళ్లు.. ఒక రోజు ఈ దేశ సోదరభావాన్ని కోల్పోతారని అఖిలేశ్ హెచ్చరించారు. యూపీ, కేంద్రంలోని బీజేపీ సర్కార్లను ఉద్దేశిస్తూ ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

## జనాభా సంక్షోభం!

ప్రపంచంలోనే ఎక్కువ యువత ఉన్న దేశం మనదని గొప్పగా చెప్పుకుంటాం. 'యువ భారతం'గా మన దేశాన్ని పిలుచుకుంటాం. ఒళ్లొంచి పని చేసే యువ జనాభా ఎక్కువగా ఉండటమే భారత్ బలం. అయితే, ఈ బలం భవిష్యత్తులో ఉండకపోవచ్చు. ఇప్పటి 'యువ భారతం' మూడు దశాబ్దాల తరువాత 'వృద్ధ భారతం'గా మారబోతున్నది. జనాభా రేటు తగ్గిపోయి, వృద్ధుల జనాభా పెరగడం వల్ల ఇప్పుడు జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ఆ దేశాల అభివృద్ధికి ఇది అడ్డంకిగా మారుతున్నది. ఇదే పరిస్థితి 30 ఏండ్ల తర్వాత మన దేశానికీ ఎదురుకాబోతున్నది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండనుంది.

## రైతుల గోడు పట్టదా?



తమ డిమాండ్ల సాధన కోసం దీర్ఘకాలంగా నిరసన తెలియచేస్తున్న రైతుల గోడును పట్టించుకోనందుకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వంపై ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగంలో పెరుగుతున్న అసంతృప్తి పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ వెంటనే రైతులతో చర్చలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఇది చాలా తీవ్రమైన విషయమని, దీన్ని తేలికగా తీసుకుంటున్నామంటే మనం దీనిపై ఆచరణాత్మకంగా లేమని, మన విధానాల రూపకల్పన సరైన పంథాలో లేదని భావించాలని స్పష్టం చేశారు.

## ఉద్యోగం కోసం యుద్ధాన్ని లెక్కచేయక!

ఏడాది కాలంగా యుద్ధంలో కూరుకుపోయిన ఇజ్రాయెల్‌కు వెళ్లేందుకు ప్రపంచ దేశాల ప్రజలు ధైర్యం చేయడం లేదు. అయితే, మన దేశంలోని ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకులు మాత్రం సంక్షోభంలో ఉన్న దేశాన్ని వెతుక్కుంటూ వెళ్తున్నారు. ఇజ్రాయెల్‌లో వివిధ రంగాల కార్మికులకు తీవ్ర కొరత ఉంది. పాలస్తీనా నుంచి వచ్చే కార్మికులపై ఆంక్షలతో కొరత మరింత పెరిగింది. దీంతో ఆ దేశ పాపులేషన్, ఇమిగ్రేషన్ అండ్ బార్డర్ అథారిటీ (పీఐబీఏ), భారత నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) కలిసి యూపీలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాయి. నవంబర్ 26 నుంచి డిసెంబర్ 3 వరకు జరిగిన నియామక కార్యక్రమానికి వందలాదిగా యువకులు హాజరయ్యారు. వీరంతా ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి కోర్సులు చదివిన వారే. యూపీలో నిరుద్యోగం తీవ్రంగా ఉండటం, ఏదైనా పని దొరికినా చాలీచాలని వేతనం కారణంగానే ఇజ్రాయెల్ వెళ్లాలని అనుకుంటున్నట్టు యువకులు చెప్తున్నారు. ఇక్కడ రోజుకు రూ.500 దొరకడం కూడా కష్టమేనని, ఇజ్రాయెల్‌లో నెలకు రూ.1.37 లక్షల నుంచి రూ.1.92 లక్షల వరకు వేతనం వస్తున్నదని, అందుకే యుద్ధం జరుగుతుందని తెలిసినా వెళ్తున్నామని అంటున్నారు.




## పాలస్తీనా ఆక్రమణను వ్యతిరేకిస్తూ ఐరాసలో తీర్మానం.. అనుకూలంగా ఓటేసిన భారత్

తూర్పు జెరూసలేం సహా 1967 నుండి తన ఆక్రమణలో ఉన్న పాలస్తీనా భూభాగం నుండి ఇజ్రాయిల్ వైదొలగాల్సిందేనన్న డిమాండ్‌ను భారత్ సమర్ధించింది. దీనికి సంబంధించి ఐక్యరాజ్య సమితి ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి మన దేశం అనుకూలంగా ఓటేసింది. ఇజ్రాయిల్- పాలస్తీనా మధ్య జరుగుతున్న ఘర్షణలపై అంతర్జాతీయంగా జరుగుతున్న చర్చలో భాగంగానే ఐరాస జనరల్ అసెంబ్లీలో ఓటింగ్ నిర్వహించారు. 'పాలస్తీనా అంశానికి శాంతియుత పరిష్కారం' అనే శీర్షికతో రూపొందించిన ఈ తీర్మానాన్ని సెనెగల్ ప్రతిపాదించగా అత్యధికంగా సభ్య దేశాలు మద్దతు తెలిపాయి. పాలస్తీనా నుండి ఇజ్రాయిల్ వైదొలగాలని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని భారత్ సహా 157 దేశాలు ఆమోదించాయి.

## పాలస్తీనియన్లకు వెల్లివిరిసిన సంఘీభావం

పాలస్తీనియన్లకు సంఘీభావం తెలియజేయడం కోసం ఐక్యరాజ్య సమితి నవంబరు 29వ తేదీని ప్రపంచ సంఘీభావ దినంగా 1977లో ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి యేటా ఈ సంఘీభావ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాపితంగా జరుపుకుంటున్నారు. ఈ ఏడాది సంఘీభావ దినోత్సవ సందర్భంగా క్యూబా, ఇరాన్, వెనిజులా, ఆఫ్రికా తదితర దేశాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి పాలస్తీనీయులకు సంఘీభావంగా నిలిచారు. సంఘీభావ దినం సందర్భంగా శాంతిని కోరుకునే వివిధ సంఘాలతో కూడిన కూటమి కార్యకర్తలు ప్రపంచ వ్యాపితంగా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించారు. ఇజ్రాయిల్ గాజాలో యుద్ధాన్ని వెంటనే ఆపాలని వారు దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని, బందీలను తిరిగి అప్పగించాలని కోరుతూ ఇజ్రాయిల్ అంతటా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలకు శాంతి కార్యకర్తలతోబాటు ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ సారథ్యం వహించింది. క్యూబా అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్ ఎక్స్‌లో పోస్టు పెడుతూ గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతను వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ చేస్తున్న ప్రతి దాడి అనేక మంది అమాయక పౌరుల ప్రాణాలను తీస్తుందని అన్నారు. ఐరాస చీఫ్ గుటెరస్ మాట్లాడుతూ, పాలస్తీనాకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని అన్నారు.పాలస్తీనా శరణార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ప్రపంచం చాలా కాలంగా ఈ శరణార్థుల సంక్షోభాన్ని పరిష్కరించకుండా అలా వదిలేసిందని ఆయన వాపోయారు.




## భారత్‌లో మైనారిటీలపై దాడులు ఆందోళనకరం

### - తన ఆత్మకథలో జర్మనీ మాజీ ఛాన్సలర్ మెర్కెల్ వెల్లడి

జర్మనీ మాజీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ భారతదేశంలో హిందూ జాతీయవాదం పెరుగుదల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో తాను సమావేశం అయినప్పుడు ఈ అంశాన్ని లేవనెత్తానని ఆమె తెలిపారు. 2014లో మోదీ పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇతర మతాల ప్రజలు, ప్రధానంగా ముస్లింలు, క్రైస్తవులపై హిందూ జాతీయవాదుల దాడులు పెరుగుతున్నాయని ఆమె తెలిపారు. అయితే ప్రతి ప్రజాస్వామ్యంలో మత స్వేచ్ఛ కీలకమైన అంశం అని మెర్కెల్ ఉద్ఘాటించారు. మెర్కెల్ 2005 - 2021 మధ్య కాలంలో భారత ఇద్దరు ప్రధానులు, మన్మోహన్ సింగ్, నరేంద మోదీలతో సంబంధాల గురించి, ఇటీవల విడుదల చేసిన "ఫ్రీడమ్: మెమొరీస్ 1954-2021" అనే తన 600 పేజీల ఆత్మకథలో వెల్లడించారు. యాదృచ్ఛికంగా, ఇదే సమయంలో జర్మనీ మాజీ రాయబారి వాల్టర్ లిడ్నర్ భారతదేశం పై రాసిన మరొక పుస్తకం కూడా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి పెరిగిన మతపరమైన విభేదాల గురించి ఇలాంటి ఆందోళనే వ్యక్తం చేసింది. 2015లో హనోవర్ మెస్సీలో జరిగిన అతిపెద్ద వాణిజ్య సదస్సులో మోదీ చూపించిన విజువల్ ఎఫెక్ట్స్ చూసి తాను చాలా ఆశ్చర్యానికి గురయ్యానని మెర్కెల్ తెలిపారు. "మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, ఇతర మతాలకు చెందినవారు, ప్రధానంగా ముస్లింలు, క్రైస్తవులు, హిందూ జాతీయవాదుల చేతుల్లో దాడికి గురవుతున్నారనే నివేదికలను చూసి నేను ఆందోళన చెందాను" అని మెర్కెల్ తన జ్ఞాపకాలలో రాశారు. తాను ఈ విషయాన్ని మోదీ వద్ద ప్రస్తావించినప్పుడు ఆయన ఆ విషయాన్ని ఖండించారని, భారత్ మత సహనం గల దేశంగా ఉంటుందని తనతో అన్నారని మెర్కెల్ చెప్పారు. మెర్కెల్ రాసిన ఈ పుస్తకం నవంబర్ 26న విడుదలైంది.


# గురువు స్థానం ఉన్నతమైనది!

**ముహమ్మద్ వహీదుద్దీన్**

**పూర్వ కాలంలో** ఒక గొప్ప మహా పండితుడు ఉండేవాడు. ఆయన పేరు ముహమ్మద్ అబ్దుల్ అర్షద్‌ఖాన్. ఆయన వద్దకు విద్యనభ్యసించడానికి దూరం దూరం నుంచి విద్యార్థులు కోకొల్లలుగా వచ్చేవారు. విద్యను అభ్యసించడానికి వచ్చిన విద్యార్థులందరికీ ఒక్క విద్యనే కాకుండా సంస్కారాన్ని అలవరచే వారు. ఐదు పూటలా నమాజును స్థాపించేవారు. ఎంతోమంది ఆయన శిష్యరికంలో ప్రయోజకులయ్యారు. ముహమ్మద్ అబ్దుల్ సత్తార్ ఖాన్ అనే యువకుడు కూడా ముహమ్మద్ అబ్దుల్ అర్షద్ ఖాన్ గురువువద్ద విద్యనభ్యసించడానికి ఆయన ఆశ్రమంలో చేరాడు. ఆ యువకుడు గురువు గారితో ఎంతో అణుకువగా, నిమ్రతగా, క్రమశిక్షణగా ఉండేవాడు. గురువు ముందు ఎంతో వినయ విధేయతలతో ప్రతిరోజు మసలుకునేవాడు.

గురుశిష్యుల మధ్య సాన్నిహిత్యం చాలా పెరగసాగింది. ఒకరోజు గురుశిష్యులిరువురూ కలిసి పనిమీద వేరే గ్రామమైన ఇమాంబాద్ కు బయలుదేరారు. ముహమ్మద్ అబ్దుల్ సత్తార్ ఖాన్ గురువుగారిని అగౌరవపరచకూడదనే ఉద్దేశ్యంతో గురువుకంటే రెండు అడుగులు వెనకే నడుస్తూ ఆయన మాటలు వింటూ నడుస్తున్నాడు. అలా వెళుతుండగా దారి మధ్యలో అహ్మదీపురం గ్రామం వద్ద ఒక పెద్ద వాగును దాటవలసి వచ్చింది.

దాంతో గురువైన ముహమ్మద్ అబ్దుల్ అర్షద్ ఖాన్ శిష్యుడైన మహమ్మద్ అబ్దుల్ సత్తార్ ఖాన్‌కు తగిన జాగ్రత్తలు చెబుతూ తాను ముందు వాగులోనికి దిగారు. ముహమ్మద్ అబ్దుల్ సత్తార్ ఖాన్ తన గురువును వెంటనే రెండు చేతులు పట్టి ఒడ్డుకు లాగి "గురువర్యా"! ముందుగా నేను ఈ పెద్దవాగు దాటుతాను, తరువాత మీరు రండి" అన్నాడు వినయంగా తన తలను కిందికి దించి. "లేదు లేదు నేను ముందు ఈ పెద్ద వాగును దాటుతాను. "లేదు గురువుగారూ! నేనే ముందు ఈ పెద్దవాగును దాటుతాను" అన్నాడు శిష్యుడు. చివరకు గురువే కాస్త వెనక్కి తగ్గారు. అబ్దుల్ సత్తార్ ఖాన్ సంతోషంతో తనే ముందుగా పెద్దవాగును దాటాడు. తరువాత గురువు వాగును దాటారు. మొత్తానికి గురుశిష్యు లిరువురూ పెద్దవాగును దాటి ఓ మామిడిచెట్టు నీడన సేదతీరారు. గురుశిష్యు లిద్దరూ తెచ్చుకున్న ఆహారాన్ని కలిసి భుజించారు. ఆ చెట్టు కిందనే జోహర్ నమాజ్‌ను స్థాపించారు. అప్పుడు గురువు ముహమ్మద్ అబ్దుల్ అర్షద్ ఖాన్ మాట్లాడుతూ" నీకు తలబిరుసుతనం ఎక్కువ. నా మాటకు విలువ ఇవ్వకుండా నాకంటే ముందు నువ్వే పెద్దవాగును దాటి నీ మాటే నెగ్గించుకున్నావు." అంటూ శిష్యుడిని గట్టిగా అడిగి నారు. దీనికి శిష్యుడు నేను కేవలం నా బాధ్యతను నెరవేర్చాను" అన్నాడు. ఈ మాటలు విని గురువు ఆశ్చర్యపోతూ "అదెలా" అని అన్నారు. "అసలే వానాకాలం, పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఒక వేళ మీరే ముందు పెద్దవాగును దాటితే ఆ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే వేల మంది శిష్యులకు నేను అన్యాయం చేసిన వాణ్ని అయ్యేవాడిని అన్నాడు". అదెలా అన్నారు గురువు కాస్త ఆశ్చర్యంగా. నాలాంటి వేల మంది శిష్యులు మీలాంటి ఒక గురువును తయారు చేయలేరు కదా. అదే మీరు క్షేమంగా ఉంటే నాలాంటి విద్యార్థుల్ని ఎన్నివేల మందినైనా తయారు చేయగలరు" అన్నాడు శిష్యుడు. ఈ మాటలకు గురువు అమితానందభరితుడై, తన ముద్దుల శిష్యుడైన మహమ్మద్ అబ్దుల్ సత్తార్ ఖాన్‌ను మనసారా దీవించారు. ఆనందంతో, సంతోషంతో అతని కళ్లు చెమ్మగిల్లాయి. ఇలాంటి ముందుచూపు ఉన్న శిష్యుడు తనకు లభించినందుకు రెండు చేతులెత్తి అల్లాహ్‌కు శత కోటి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**